
# సాధనలో స్థితులు

బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి



# సాధనలో స్థితులు



రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి


మొదటి ముద్రణ : జూలై, 2025

ప్రతులు : 2,000

వెల : రూ.70/-

పుస్తకముల కొరకు :-


**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# విషయ సూచిక


1. సాధనలో స్థితులు.................................. 3
2. సాధకునికి ఉండవలసిన శ్రద్ధ ........................... 8
3. ఆత్మజ్ఞానులు అవ్వాలంటే? .......................... 17
4. సత్యం, ధర్మం ఎప్పుడు నశిస్తుంది? ..................... 22
5. పరా ప్రకృతి – అపరా ప్రకృతి ........................ 29
6. బుద్ధి లక్షణాలు?....................................... 38
7. "మానవులలోని రకాలు" ................................ 57
8. పరోక్ష జ్ఞానం ప్రత్యక్ష జ్ఞానంగా మారాలి అంటే? ...... 59

## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

# సాధనలో స్థితులు

తెలియని విషయాలు తెలుసుకోవడానికే భూమి మీదకి వస్తారు. కాబట్టి తెలుసుకోవాలనే తపన ఉంటే చెప్పేవాళ్ళు కూడా ఎదురవుతారు. జ్ఞానము అంటే ప్రతి విషయాన్ని తెలుసుకుని, అర్థం చేసుకుని, ఆచరణలో పెట్టుకోవడమే. శ్రీకృష్ణుడు లాంటి వాళ్లే భూమి మీదకు వచ్చి నిర్యాణం చెందితే! సామాన్యులు శాశ్వతంగా ఉంటారా? ముందు వాళ్ళని చూస్తున్నా వీరేదో పూర్తిగా భూమి మీద ఉండిపోతామన్నట్టు ప్రవర్తిస్తారు.

అలా అనుకుంటూ ఎప్పుడూ చావు గురించి కానీ, మరణానంతర జీవితం గురించి కానీ ఎప్పుడూ ఆలోచించరు. కానీ ఎవరైతే భూమి మీద ఉండగానే యోగ జీవితం జీవిస్తారో! సద్గురువులు చెప్పిన సాధన చేస్తారో! జ్ఞానం పొందడానికి తపన పడుతూ ఉంటారో! అలాంటి వాళ్ళకి మరణానంతర జీవితం చాలా గొప్పగా ఉంటుంది.

ఈ కలియుగంలో ప్రాపంచిక భోగాలు, సుఖాలు, లాభాల కోసమే యోగాన్ని అభ్యసిస్తున్నారు. కాని యోగం అన్నది ఆత్మోద్ధరణ కోసమని, ఆత్మ ఉన్నత స్థితి పొందడం కోసమని తెలుసుకోలేక పోతున్నారు.

గురువు అందరిని ఆత్మ జ్ఞానులుగా మార్చాలనే ఆశయంతో భూమి మీదకు వచ్చి, ధ్యానం ద్వారా అందరిని ఉన్నతులుగా చేయాలని కోరుకుంటారు. ఎవరైతే ఆత్మ జ్ఞానం కావాలని కోరుకుంటారో వారు గురువు మెచ్చిన శిష్యులుగా తయారవుతారు. కానీ శిష్యుడు ఎదుగుతున్నట్టు ఎలా తెలుస్తుంది?

ఉత్తరగీతలో శ్రీకృష్ణ భగవానుడు సాధన నాలుగు స్థితుల్లో ఉంటుంది అని చెప్పారు. అవి ఏమిటంటే?

1) సమాధి, 2) సవికల్ప సమాధి, 3) నిర్వికల్ప సమాధి, 4) సహజ నిర్వికల్ప సమాధి.

**1) సమాధి స్థితి : -**

సాధనలోకి  వచ్చాక యోగం అభ్యసించి, నిష్కామ కర్మలు చేసి భగవంతుడు ఉన్నాడని అన్వేషణ ప్రారంభిస్తారు. ఆ భగవంతుడు విగ్రహాల్లో కాదు అన్ని జీవులలోను ఉన్నాడని గురువు ద్వారా, ఎన్నో గ్రంథాల ద్వారా తెలుసుకుంటారు.

భగవంతుడ్ని  దర్శించాలి అంటే యోగ మార్గమే సరియైనదని తెలుసుకుంటారు. అలాగే ఒక్కొక్క ప్రశ్నకి  సమాధానం తెలుసుకుంటారు. అలా "సమాధానాలు దొరికే స్థితినే సమాధి స్థితి" అంటారు.

పత్రి గారు మాంసాహారం మానమని, అన్ని జీవులలోని అంతర్యామిగా ఆత్మ అంటే భగవంతుడు ఉన్నాడు అన్నారు. అప్పటివరకు ఆ జీవులన్నీ  తినడం కోసమే ఉన్నాయి అనుకునే వారందరికీ,  మాంసాహారం ఎందుకు తినకూడదు? అనే ప్రశ్నకి వచ్చిన సమాధానం "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే వేద వాక్కు.

భగవంతుడు ఎక్కడో లేడు అన్ని జీవులలోను అంతర్యామిగా ఉన్నాడు, సృష్టి అంతా ఉన్నాడు, పంచభూతాల్లోను ఉన్నాడు అని తెలుస్తుంది. ఈ విధంగా భగవంతుడు ఎక్కడ ఉంటాడు? అనే సమాధానం  దొరుకుతుంది. అంతేకాదు "జీవుల్ని హింసిస్తే భగవంతుని హింసించినట్లే" అని తెలుస్తుంది.

**2) సవికల్ప సమాధి స్థితి:-**

అలాగే గురువు ద్వారా, సత్ గ్రంథాల ద్వారా చాలా విషయాలు తెలుస్తాయి. ఇవన్నీ తెలుసుకున్నాక చిత్తం చాలా ప్రశాంతంగా అవుతుంది. అంతా భగవంతుడే, నేను అనేది ఏమీ లేదు, ప్రక్కవాడు నేను వేరే కాదు అని తెలుస్తుంది.  కానీ ఎన్ని తెలుసుకున్న కొన్ని సందేహాలు అలాగే ఉండిపోతాయి. అలా ఉండిపోయిన స్థితినే సవికల్ప సమాధి స్థితి అంటారు.

**3) నిర్వికల్ప సమాధి స్థితి:-**

ఈ స్థితిలో కూర్చోగానే శూన్యంలోకి వెళ్ళిపోతారు. అక్కడ ఏ

సంశయాలు ఉండవు, చిత్తం పూర్తిగా శాంతిస్తుంది, అన్నిటికీ సమాధానాలు దొరుకుతాయి. ఈ స్థితినే నిర్వికల్ప సమాధి స్థితి అంటారు.

ఈ స్థితిలో ఎన్నో దృశ్యాలు కనిపిస్తాయి, ఎందరో మాస్టర్స్ కనిపిస్తూ ఉంటారు, పరమ గురువులతో అనుసంధానం అవుతూ ఉంటారు, పూర్ణాత్మతో అనుసంధానం అవుతారు. అప్పుడు నేను ఎందుకు భూమి మీదకి వచ్చాను? నేను చేయవలసిన పని ఏమిటి? అన్నది అర్థమవుతుంది. అంటే తాను అందరిని జ్ఞానవంతులను చేసి, పూర్ణాత్మగా ఎదగాలని అర్థమవుతుంది.

మనసు మహా పరిశూన్యం అయిపోతూ ఉంటుంది. పరమ గురువులతో కాని, పూర్ణాత్మతో కాని అనుసంధానం అయినప్పుడు ప్రాపంచిక విషయాల మీద పూర్తిగా ఆసక్తి తగ్గిపోతుంది, ఆత్మ మీదే ఆసక్తి ఉంటుంది.

ఈ స్థితిలో అందరికీ సత్య మార్గాన్ని బోధించాలి, అందరినీ సత్యంలో జీవించేలాగా చేయాలి అన్న ప్రయత్నమే వుంటుంది. ఎదుటి వాళ్ళు మాట్లాడు తున్నప్పుడు వాళ్ళ జ్ఞానం ఏ పరిధిలో ఉందో అర్థమవుతుంది. పూర్తిగా సంశయాలు లేని స్థితే నిర్వికల్ప సమాధి స్థితి.

**4) సహజ నిర్వికల్ప సమాధి స్థితి:-**

ఈ స్థితిలో ఉన్నపుడు ప్రాపంచిక జీవితంలో కూడా అత్యున్నత స్థాయికి వెళ్తారు. వీరు ఏ మాట మాట్లాడుతున్నా, ఏ పని చేస్తున్నా ఆత్మ స్థితిలోనే ఉంటారు. వీరిని సామాన్యులు దేవుళ్ళు అంటారు.

పత్రిగారిని గమనిస్తే ఆయన లోక కళ్యాణకరమైన పనులే చేస్తారు. వారు ఆత్మ స్థితిలో ఉంటారు, వారు ఎవరిని విమర్శించరు, ఎవరి గురించి నిర్ణయాలు చేయరు. ఆయన ఆత్మ, ధ్యానం, జ్ఞానం అనే మూడు పదాలు తప్పించి వేరే మాట్లాడరు.

ఇలాంటి ఈ స్థితికి వచ్చిన వారు ఎప్పుడూ కూడా భయం లేకుండా చెప్పాలనుకున్న సత్యాన్ని నిర్భయంగా చెప్తారు. **"ఆత్మ స్థితిలో ఉన్నవాడు దేనికీ, ఎవరికీ, భయపడడు, ప్రలోభాలకు లొంగడు".**

పత్రిగారు కాని, రాఘవరావు గారు కాని ఎవరికీ భయపడరు, లోకులు ఏమనుకుంటారో వాళ్ళకి అనవసరం, లోకేశ్వరుడు మెచ్చే పనులే చేస్తారు.

భూమి మీదకి వచ్చిన మానవ జన్మ ఉద్దేశం ఏమిటంటే? తాను ఎవరో తెలుసుకోవాలి, ఆ మార్గంలో పయనించాలి, తెలుసుకున్న సత్యాన్ని పది మందికి బోధించాలి. దానికి తీవ్రమైన తపన ఉండాలి. నేను బాగుండాలి, నేనే మోక్షానికి వెళ్ళాలి అంటే మూడో స్థితిలోనే ఉంటాం. నాలుగో స్థితి ఏమిటంటే సహస్రార స్థితి.

అంటే ఇక్కడ ఎవరికీ భయపడకుండా, ప్రలోభాలకు లొంగకుండా, ప్రపంచ ఆకర్షణలకు లొంగకుండా, ప్రపంచంలో ఉంటూ తన చుట్టూ వున్న జనాలకి సత్యం చెప్తూ, సత్యంలో జీవింపచేస్తూ , సత్యాన్ని ఎలుగెత్తి చాటగలిగే స్థితి. ఇలాంటి వాళ్ళు భూమి మీద చాలా అరుదుగా ఉంటారు.

సత్య హరిశ్చంద్రుడు పేదరికం వస్తుంది, ఎన్నో కష్టాలు వస్తాయని తెలిసినా నిర్భయంగా ఆత్మ స్థితిలో జీవించాడే కానీ భయపడి వెనకడుగు వేయలేదు. అందుకే సత్యంలో జీవించే వాళ్ళందరూ కూడా సహస్రార స్థితికి చేరుకున్నట్టే అని అర్థం చేసుకోవాలి. వీళ్ళ స్థితి సహజంగా ఉంటుంది అంతే కానీ తెచ్చిపెట్టుకున్న స్థితి కాదు.

అందుకే **"సమాధి స్థితి అంటే అంతరంగంలో సమాధానాలు దొరుకు తున్న స్థితి".** సవికల్ప స్థితి అంటే వారి ప్రయత్నంతో చిత్తాన్ని ప్రశాంతంగా ఉంచుకుంటారు. అలా చేయగా చేయగా కుండలిని శక్తి జాగృతం అయ్యే వరకు వారి ప్రయత్నం ఉంటుంది. అంతవరకు సాధనలో ప్రయత్నం అవసరమే.

మరి నిర్వికల్పం అంటే ఇక్కడ కుండలినీ జాగృతం అవుతూ ఉంటుంది. ఇక్కడ పరలోకంలో ఉన్న మాస్టర్స్ తో కానీ, పరమ గురువులతో కానీ పూర్ణాత్మతో కానీ అనుసంధానం అవుతారు. నాలుగోది ఇంకా ధ్యానంలో కూర్చోకపోయినా బయట ప్రపంచంలో తిరుగుతున్నా కూడా ఆత్మ స్థితిలో

ఉంటారు. ఏ ప్రలోభాలకి లొంగని స్థితి. వీళ్ళు సహస్రార స్థితికి వస్తున్న వాళ్ళు. వీళ్ళకి భయమే ఉండదు, నిర్భయంగా జీవిస్తూ ఉంటారు.

మరి ఈ నాలుగు స్థితుల్లో మనం ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకొని ఆ తర్వాత స్థితికి వెళ్ళడానికి ప్రయత్నించాలి. ముందు ఆ చిత్తాన్ని నిశ్చలం చేసుకోవాలంటే "జగత్ మిథ్య ఆత్మ సత్యం" అనేది ఎప్పుడూ మర్చిపోకూడదు. మర్చిపోయినప్పుడు చిత్తం ప్రపంచం వైపు వెళ్తుంది. ప్రపంచం వైపు తిరిగిన చిత్తాన్ని మళ్ళీ పరమాత్మ వైపుకు తిప్పాలి, అప్పుడు కుండలినీ శక్తి జాగృతం అవుతూ ఉంటుంది. అయినప్పుడు ఒక దేవుడిగా భూమి మీద జీవిస్తూ ఉంటారు.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# సాధకునికి ఉండవలసిన శ్రద్ధ

ధ్యాన మార్గంలోకి వచ్చిన వారికి ముందు ధ్యానం కుదరాలి, తరువాత జ్ఞానం పెరగాలి. ధ్యానంలో కూర్చున్న దగ్గర నుంచి మనకి ధ్యానం కుదరకపోతే కూర్చున్నా అది వృధా అనిపిస్తుంది. అలాగే చేస్తున్న ధ్యానం వల్ల జ్ఞానం పెరుగుతూ ఉండాలి, ప్రతి విషయం గురించి అవగాహన చేసుకోవడమే జ్ఞానం.

ధ్యానం మొదలు పెట్టిన దగ్గర నుంచి ప్రతిరోజు నేను ఎలా ఎదుగుతున్నాను? నా సాధన ఎంత కుదురుతుంది? అని పరిశీలించుకుంటూ ఉండాలి. అందుకే **"వశిష్టుల వారు "విచారణే పరమజ్ఞానం" అన్నారు".** అంటే విచారణ చేసుకుంటూ ఆ జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండాలి. విన్న ప్రతిది వదిలేయడం కాదు, ప్రతీదీ ఆలోచించాలి, విచారణ చేయాలి. దానివల్లే ఎదుగుతారు.

ప్రతి విషయం వింటున్నాం, విన్న విషయాల మీద ఎంత శ్రద్ధ పెడుతున్నాం? అనే దాని మీదే ఒక సాధకుడి ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. శ్రద్ధ పెట్టినవాడు ముందుకు వెళ్ళిపోతూ ఉంటాడు. ధ్యానం చేస్తున్నా, ఈ జ్ఞానం నేర్చుకునే విషయంలో అశ్రద్ధ ఉంటే ఎదుగుదల అంత తీవ్రంగా ఉండదు.

అందుకే మీరు గమనించండి రాఘవరావు గారు ప్రతి వాళ్ళని జ్ఞానం పెంచుకో, జ్ఞానం పెంచుకో అంటూ ఉంటారు. జ్ఞానం పెంచుకో అంటే అర్థం ఏమిటి? ఆ పెంచుకోవడంలో శ్రద్ధ పెట్టాలి. గురువులు చెప్పినప్పుడైనా, పుస్తకాల్లో చదువుతున్నప్పుడైనా ప్రతి విషయాన్ని యధాలాపంగా వినకూడదు, యధాలాపంగా చదవకూడదు, శ్రద్ధ ఉండాలి. ఆధ్యాత్మిక జీవితంలో శ్రద్ధ అన్నది చాలా ముఖ్యమైన విషయం.

మహాత్ములందరూ కూడా మానవుడు శ్రద్ధా స్వరూపుడు అని చెప్తారు. ఆ శ్రద్ధ కూడా మూడు రకాలుగా ఉంటుంది అని భగవద్గీతలో చెప్పడం

జరిగింది.

1) సాత్విక శ్రద్ధ, 2) రాజసిక శ్రద్ధ, 3) తామసిక శ్రద్ధ

ఈ శ్రద్ధలు మానవులకి ఎలా ఉంటాయో వాళ్ళు చేసే పనులు, వాళ్ళ వ్యవహారం, ఆహారం అన్నీ కూడా అలాగే ఉంటాయి. అంటే తామసిక శ్రద్ధ ఉన్నవాడు ఒకలా ప్రవర్తిస్తాడు. రాజసిక శ్రద్ధ ఉన్నవాడు ఒకలా ప్రవర్తిస్తాడు. సాత్విక శ్రద్ధ ఉన్నవాడు ఒకలా ప్రవర్తిస్తాడు, వీరి వీరి ఆహారాలు కూడా వేరు వేరుగా ఉంటాయి.

శ్రద్ధ అనేది మొత్తానికి అందరికీ ఒకటే పదమైనా. వాళ్ళ మనసుకున్న గుణాలను బట్టి దేని మీద శ్రద్ధ పెట్టాలో, దేని మీద పెట్టకూడదో తెలియని స్థితిలో కూడా కొంతమంది ఉంటారు. మరి సాత్వికుల శ్రద్ధ ఎలా ఉంటుంది? రాజసికుల శ్రద్ధ ఎలా ఉంటుంది? తామసికుల శ్రద్ధ ఎలా ఉంటుంది? అని మూడు చెప్పి రాక్షస శ్రద్ధ కూడా చెప్పారు. అంటే ప్రాపంచికంలో మూడే ఉన్నా ఆధ్యాత్మికంలో నాలుగోది కూడా ఇవ్వడం జరిగింది.

**1) సాత్విక శ్రద్ధ :**

సాత్విక గుణంలో ఉన్నవాడి శ్రద్ధ ఎట్లా ఉంటుంది అంటే? వాళ్ళకి గురువు వచ్చేవరకు ప్రాపంచిక విషయాలలో సాత్వికంగా అంటే నెమ్మదిగా ఒక విభీషణుడిలా తప్పు చేయకూడదు, పాపం చేయకూడదు, ఎవరిని బాధ పెట్టకూడదు అని అనుకుంటారు. గురువు వచ్చాక ధ్యానం, జ్ఞానం తెలుసుకున్నాక వాళ్లు ధ్యానంలో ముందుకు వెళ్తూ ఉంటారు. ఎందుకంటే సాత్విక గుణమే సత్యానికి దగ్గర చేస్తుంది అని శంకరాచార్యులు చెప్పడం జరిగింది.

సాత్విక గుణంలో ఉన్నవాడే సత్యానికి దగ్గర అవ్వగలడు కానీ, తామస, రాజస గుణాలు ఉన్నవాడు సత్యానికి దూరంగానే ఉంటాడు. అందుకే సాత్విక గుణంలో ఉన్నవాళ్ళు చేసే సాధన మహా అద్భుతంగా ఉంటుంది. వీళ్ళు యజ్ఞాలు చేసినా అద్భుతంగానే చేస్తారు. వాళ్ళు వాళ్ళ పేరు ప్రతిష్టల కోసం, వారి సుఖం కోసం, వారి సంతోషం కోసం, యజ్ఞాలు చేయరు. లోక

కళ్యాణం కోసం చేస్తారు.

చాలామంది ధ్యానం చేస్తే చాలు, అవి అవసరం లేదు అనుకుంటారు. కానీ, ధ్యానం చేసే వాళ్ళకి ఒక రకం యజ్ఞం ఉంటుంది. చేయని వాళ్ళకి వేరే వేరే యజ్ఞాలు ఉన్నాయని భగవద్గీతలో తెలుసుకోవచ్చు. మరి ధ్యానులు ఏ యజ్ఞాలు చేస్తారంటే? ధ్యాన యజ్ఞాలు చేస్తారు. వారి వారి శక్తులను బట్టి పది మంది కూర్చుని ధ్యానం చేసే అవకాశాన్ని కల్పిస్తారు.

మీరు మీ పరిధిలో చిన్న చిన్న క్లాసులు పెట్టొచ్చు, రాఘవరావుగారి లాంటి వాళ్ళు వందల మందికి చెప్పొచ్చు, పత్రి గారు వేలు, లక్షల మందిచే ధ్యాన యజ్ఞాలు చేయించగలరు.

ఏదో యజ్ఞం చేసేస్తున్నామంటే అయిపోదు. ఒక యజ్ఞం చేసినా, దానాలు చేసినా ఇది నా ధర్మం అని చెయ్యాలి, అలా సాత్విక స్థితిలో ఉన్నవారే చేయగలరు. వాళ్ళకి సత్యం తెలుసు. ఈ డబ్బు నాది అనే భ్రాంతిలో ఉండరు. జ్ఞానులు ఉపనిషత్తుల సారాన్ని తెలుసుకుంటారు. అందుకే ఈశావాస్య ఉపనిషత్తు చెప్పినట్టుగా వాళ్ళు త్యాగ గుణంతో ఉంటారు. త్యాగం అంటే వాళ్ళకు ఉన్నది పది మందికీ పంచిపెట్టి తింటారు. ఏది నాది కాదు అనే సత్యాన్ని తెలుసుకుంటారు.

తనదనుకునేది కొంతైనా పది మందికి ప్రతిఫలం ఆశించకుండా దానం ఇస్తారు. అంటే సాత్విక గుణంలో శ్రద్ధ ఎట్లా ఉంటుందో ప్రతి విషయాన్ని గమనిస్తూ ఉండాలి. వాళ్ళు సాధన చేస్తారు, జ్ఞానం పొందుతారు, మళ్ళీ యజ్ఞాలు మానవుడి కర్తవ్యం అని తెలుసుకుని జ్ఞాన యజ్ఞాలు చేస్తారు. ఈ జ్ఞాన యజ్ఞాలే పరమాత్మకి ఇష్టం అని తెలుసు కాబట్టే పత్రిగారు చేస్తూ, మన చేత కూడా చేయిస్తున్నారు.

అందుకే జ్ఞాని సత్కర్మలు, యజ్ఞ కర్మలు చేస్తూ ఇంకా ఇంకా పరమాత్మకి దగ్గర అవుతాడు. మరి వీరి మనసు సాత్వికం నుంచి శుద్ధ సాత్వికం వైపు వెళ్తుంది. వీళ్ళు ధ్యానం నా ధర్మం, మానవ జీవితంలో అంతిమ లక్ష్యం సాధన చేసి పరమాత్మకి దగ్గర అవ్వాలి అని తెలుసుకుంటారు కాబట్టి సాధన

మానరు, జ్ఞానం మానరు, వాళ్ళు పొందిన జ్ఞానాన్ని పది మందికి పంచడం మానరు.

ధన దానము, జ్ఞాన దానము, శక్తి దానము, వాక్కు దానము చేస్తారు, ఇంద్రియాలను ఈ సేవలకే ఉపయోగిస్తారు. అంటే సాత్వికుల శ్రద్ధ ఎలా ఉంటుందంటే తాను అనుభవిస్తూ పరోపకారం చేయడానికి ఎప్పుడూ ముందుంటారు. వారు సుఖపడుతూ ప్రక్కవారు కూడా సుఖపడాలి, వారు ఆనందపడుతూ ప్రక్కవారు కూడా ఆనందపడాలి అని శ్రద్ధతో ఉంటారు.

ధ్యానంలోకి వచ్చారు అంటే సత్వగుణంలో ఉన్నట్టు. ఈ సాత్విక శ్రద్ధ ఉన్నవారి మనసు ఎప్పుడూ కలుషితం అవ్వదు. కారణం వీళ్ళు తినే ఆహారం సాత్విక గుణాన్ని పెంచేటట్టే ఉంటుంది, శాఖాహార భోజనమే సాత్విక గుణాన్ని పెంచుతుంది. కాని ఒక ప్రాణిని హింసించి తిన్న మాంసాహారం సాత్విక గుణం నుంచి రజోగుణంలోకి, తమోగుణంలోకి వెళ్ళిపోతారు కాబట్టి సాత్వికులు ఎప్పుడూ కూడా శాఖాహార భోజనమే తీసుకుంటారు.

అంతేకాకుండా ఆ భోజనంలో కూడా ఎలాంటి భోజనం చేస్తారంటే? సాత్విక గుణం పెంచాలి అంటే రసముతో కూడినది, ఆకలిని తగ్గించేది ఎక్కువ సేపు శక్తిని పెంచేది, ఇట్లాంటి కొన్ని పదార్థాలు మాత్రమే వాళ్ళు తీసుకుంటారు, కానీ రజోగుణాన్ని పెంచే ఆహారం సాత్వికులు తినరు. వాళ్ళ ఆహారం ఎప్పుడూ నిష్టతో ఉంటుంది కాబట్టే వాళ్ళ మనసు నిశ్చల స్థితిలో, సాత్వికంలో ఉండ గలుగుతారు.

ఆహారం ఎంత జాగ్రత్తగా తీసుకుంటే మనసు అంత శుద్ధత్వంలో ఉంటుంది అని తెలుసుకుంటారు. ఆ గుణాన్ని పెంచుకోవడంలోనూ, ధ్యానం చేయడంలోనూ, జ్ఞానం పెంచుకోవడంలోనూ, అది పంచడంలోనూ శ్రద్ధతో ఉంటారు.

అందుకే రాఘవరావు గారు ప్రతి క్షణం అందరికీ జ్ఞానాన్ని ఎలా పెంచాలి? శిష్యుల్ని ఎలా తయారు చేయాలి? అని చూస్తారు. మాటల్లో తప్పు చేస్తే జ్ఞానం తగ్గిపోతుంది, చేతల్లో తప్పు చేస్తే ధ్యాన శక్తి తగ్గి పోతుంది కాబట్టి

మాటల్లో, చేతల్లో చిన్న పొరపాటు కూడా ఉండకుండా ఎప్పుడూ ఆయన శిష్యులని సరిచేస్తూ ఉంటారు. అందుకే **"సాత్విక శ్రద్ధ ఉన్నత స్థితికి తీసుకు వెళ్లి సత్యాన్ని చేరుకునేటట్టు చేస్తుంది".** అంతేకాదు వాళ్ళు పరమాత్మకు ప్రీతిగా ఉంటారు.

**2) రాజసిక శ్రద్ధ:-**

వీళ్ళు ఫలాపేక్ష తో అంటే కోరికతో యజ్ఞాలు చేస్తారు అంటే వాళ్ళకి ఏదో ఒక కోరిక ఉంటే ఆ కోరిక నెరవేరాలని చేస్తూ ఉంటారు. లేదా గొప్ప కోసం, పది మంది పొగడాలని యజ్ఞాలు చేస్తారు. వీళ్ళ యజ్ఞాలు, దానాలు కూడా అలాగే ఉంటాయి. 10 మంది పొగడాలి, 10 మంది నన్ను గుర్తించాలి అనేదే వీళ్ళ ఉద్దేశం.

వీళ్ళు తినే ఆహారాన్ని బట్టి వీళ్ళ గుణం ఉంటుంది. వీళ్ళు భగవంతుణ్ణి పూజిస్తే లేదా ఒక యజ్ఞం చేస్తే గొప్ప అనుకుంటారు. ఈ రాజసికులు కూడా ధ్యానం మీద దృష్టి పెట్టరు. ఒకవేళ చేసినా ప్రాపంచిక లాభాల కోసమే ధ్యానం చేస్తారు. అంటే ఆరోగ్యం బాగుండాలనో, కోరికలు నెరవేరాలనో చేస్తారు. అలా చేస్తే అది రాజసిక ధ్యానమే అవుతుంది.

ఏ కోరికా లేకుండా పరమాత్మ దర్శనం కావాలి అని తెలుసుకొని చేసేది సాత్విక ధ్యానం అయితే, కోరికతో చేసే ధ్యానం రాజసిక ధ్యానం. చాలామంది ఏ లాభం లేకపోతే ధ్యానం ఎందుకండి? అంటారు. అంటే వాళ్ళ పరిధిని బట్టి వాళ్లు అలాంటి ప్రశ్న వేస్తారు. వాళ్ళ ఆలోచనా పరిధి, వాళ్ళ మనస్తత్వం అలాగే ఉంటుంది. వాళ్ళు రాజస గుణంలో ఉన్నారు కాబట్టి వాళ్ళు ఏ లాభం లేకుండా ఏ పని చేయరు.

అందుకే వాళ్ళు ధ్యానాన్ని కూడా లాభానికి ఉపయోగించుకుంటారు. మరి భగవద్గీత చదివిన వాళ్ళకి, వేదాలు, ఉపనిషత్తులు చదివిన వాళ్ళకి కోరికతో ధ్యానం చేయొచ్చా? లేదా? అన్నది ఖచ్చితంగా తెలుస్తుంది. వ్యాస భగవానుడు కలియుగానికి ఇన్ని వేదాలు, ఇన్ని ఉపనిషత్తులు, చిట్ట చివరిలో భగవద్గీత ద్వారా ధ్యానం ఎలా చేయాలి అన్నది చెప్పినప్పుడు అందరూ అదే

చేయాలి. అంతేగాని ఏ ధర్మ శాస్త్రాలు, ఏ సద్గ్రంధాలు చదవని వాళ్ళ మాటలు పట్టుకొని చేస్తే రాజసిక ధ్యానం చేస్తున్నట్టే.

అంటే వాళ్ళకి పరమాత్మ మీద శ్రద్ధ కంటే కూడా ప్రపంచం మీద శ్రద్ధ ఎక్కువ వుంటుంది. అందుకే కోరికలతో సాధనలు చేస్తారు, కోరికలతో దానాలు చేస్తారు, కోరికలతో యజ్ఞాలు చేస్తారు. ఈ యజ్ఞం చేస్తే ఈ లాభం, ఈ దానం ఇస్తే ఈ పుణ్యం అని ఆశిస్తూ చేసేది రాజసిక శ్రద్ధ అవుతుంది.

వీళ్లు కొంచెం రజోగుణం పెంచే ఆహారం తీసుకుంటారు. మషాలాలు, కారం లాంటి ఉద్రేకాన్ని పెంచే ఆహారం తినడం వల్ల వీరి మనసు ఎప్పుడూ కూడా రజో గుణంలో ఉంటుంది.

**3) తామసిక శ్రద్ధ:-**

వీళ్ళు ఏ పని చేసినా శ్రద్ధ ఉండదు. యజ్ఞం చేసినా సరిగా చేయరు, పూజ చేసినా మొక్కుబడిగా చేస్తారు. ఇక ధ్యానం చెప్పక్కర్లేదు. ఆ ధ్యాన మార్గంలోకి వాళ్ళు రారు. ఈ పూజలు చేస్తే చాలదా! అనుకుంటారు. ఇప్పుడు ప్రపంచంలో చాలామంది ధ్యానం పని లేక చేస్తున్నామేమో అనుకుంటారు. కానీ భగవంతుడికి ఇష్టమైనది ధ్యాన మార్గమే, యోగే నాకు ఇష్టుడు, జ్ఞానే నాకు ఇష్టుడు అని భగవద్గీతలో చెప్పినా అర్థంకాదు, అందువల్ల తామస గుణ శ్రద్ధ ఉన్నవాళ్ళు ధ్యానానికి అంత విలువ ఇవ్వరు.

ఒకవేళ ఏ అనారోగ్యమో, లేవలేని పరిస్థితో వచ్చినప్పుడు కొన్నాళ్ళు చేసినా, రోగం తగ్గగానే మళ్ళీ మానేస్తారు. ధ్యానాన్ని రోగాన్ని తగ్గించే మందులా వాడుకుంటారు కానీ, ధ్యానం పరమాత్మని చేరుకోవడానికి మార్గమని తెలుసుకోలేకపోతున్నారు.

నువ్వు కనిపిస్తున్న ఈ సృష్టిని అనుభవిస్తున్నావు. ఈ సృష్టే ఇంత అద్భుతంగా ఉందే మరి సృష్టికర్తను చేరుకుంటే ఎంత అద్భుతంగా ఉంటుందో! అనే ఆలోచన తామసులకు రాదు, రాజసిక గుణంలో ఉన్నవాళ్ళకీ రాదు, ఒక్క సాత్విక గుణం ఉన్నవాళ్ళకే తెలుస్తుంది.

అందుకే చూడండి మన గుణాలను బట్టే మన శ్రద్ధ. అందుకే కృష్ణ

భగవానుడు "గుణాలను అధిగమించి సత్యం వైపు వెళ్ళిన వాళ్లే మాయని జయించగలరు" అన్నారు. పరమాత్మను దర్శించే అర్హత లేని వారికి సత్యలోక ప్రాప్తి ఎలా వస్తుంది? మోక్షం ఎలా వస్తుంది? ఆనందం ఎలా వస్తుంది? చనిపోయాక వచ్చే మోక్షం, చనిపోయాక వచ్చే ఆనందం కాదది. నిజంగా ధ్యానం చేస్తే భూమిమీద ఉండగా ఎప్పుడూ ఆనంద స్థితిలో ఉండాలి.

అదే శంకరాచార్యులు చెప్పారు **"అన్ని వ్యామోహాలు వదులుకుని నిత్యము మోక్ష స్థితిలో వుండే వారినే ధ్యాని, యోగి అంటారు"** అని చెప్పడం జరిగింది. మరి తామసిక శ్రద్ధ ఉంటే దేని మీదా కూడా నిలకడ లేని మనసుతో ఉంటారు. వీళ్ళకి అటు పూజ మీదా ఉండదు, అనన్య భక్తిలో ఉండరు, ఏకాంత భక్తిలోనూ ఉండరు, బాహ్య భక్తిలోనూ స్థిరం లేనివి చేస్తూ ఉంటారు, ధ్యానములో కూడా అంతే.

వీరు లాభాన్ని ఆశించి చేస్తారు, రాకపోతే జారిపోతారు.ఎందుకంటే? వీళ్ళ మనసు చంచలత్వంలో ఉంటుంది. కారణం అలాంటి ఆహారం తినడంవల్ల. నిలవ పదార్థాలు, పులిసిపోయినవి, పాచిపోయినవి తింటూ ఉంటారు. ఈ పదార్థాలు తినడం వల్ల మనసు చంచలత్వంలోనే ఉంటుంది కానీ, నిశ్చలత్వానికి రాదు.

మనసు నిశ్చలత్వంలోకి వస్తే ధ్యానం చేయాలి అనిపిస్తుంది. రజోగుణం, తమోగుణంలో ధ్యానానికి దూరం పెడుతూ ఉంటుంది. అందుకే **"గుణం మార్చుకుంటే శ్రద్ధ పెరిగి సత్యానికి దగ్గర అవుతారు".**

**4) రాక్షసులు శ్రద్ధ:-**

వీళ్ళు శరీరాన్ని కృశింప చేసుకుంటారు. అందుకే భగవద్గీతలో దంబము, గర్వము, క్రోధము లాంటి గుణాలతో ఉండి, నేను సాధించగలను అనుకుంటూ.. శరీరాన్ని కృశింప చేసుకుంటారు అని చెప్పబడింది. అలా పంచభూత తత్వమైన శరీరాన్ని పాడు చేస్తే మరి శరీరం కృశించిపోతుంది. శరీరంలో ఉన్న నన్ను అంటే ఆత్మను కూడా ఈ రాక్షస ధ్యానులు క్షోభ పెడతారు అన్నారు.

ఎందుకు చెప్పారంటే? ఎక్కువ తినకూడదు, తక్కువ తినకూడదు. యుక్తాహారం, మితాహారం తీసుకోమని గీతలో చెప్పినా, పూర్తిగా మానేసి పిచ్చిపిచ్చిగా ధ్యానం చేస్తారు, విపరీతంగా శరీరాన్ని, మనసుని, ఆత్మని కృశింప చేస్తారు. ఇది రాక్షస ధ్యానం అంటారు. ఇలా చేయకూడదు అని పత్రీజీ చెప్పడం జరిగింది.

అయితే ఇక్కడ సాత్విక గుణంలో ఉంటూ సాత్వికమైన శ్రద్ధ ఉంటే వీళ్ళు లాభం పొందుతూ, పది మందికి లాభం కలిగించే పనులు ఈ భూమి మీద ఉండే చేయొచ్చు. సర్వజీవులు ఆత్మ స్వరూపులే, ప్రతివాడు ఆత్మ స్వరూపమే. ఎక్కడైతే నేను అని మేనుకు సంబోధన మానేస్తారో! నాది, మాది అనే మమకారం వదులుతారో! అంటే నేను అనే అహంకారం, మాది అనే మమకారం ఈ రెండు కారాలు వదులుతారో  సాత్వికంలోకి వచ్చినట్లే.

ఈ సాత్వికంలోకి వచ్చినప్పుడు మొదట మీ ప్రవర్తనని గమనించు కోవాలి. ఎక్కడైనా నేను, నాది అనే  స్వార్థం వచ్చింది అంటే నా మనసు కలుషితం అయింది అని అర్థం చేసుకోవాలి. కలుషితం అవ్వడానికి కారణం తినే ఆహారం, ఆహార లోపం వలన మనసు కలుషితమైనప్పుడు ఆహారాన్ని మొదట సరి చేసుకుంటే ఆ మనసు సరిగా ఉంటుంది, అప్పుడు  చేసే పనులు సరిగా ఉంటాయి.

ఎందుకంటే కొన్ని వాసనలు, సంస్కారాలు వదలవు కాబట్టి ఒక్కొక్కసారి మాయకి వశమై మళ్ళీ ఆ మమకారంలోనో, అహంకారంలోనో పడిపోతూ ఉంటారు. అందుకే వశిష్టుల వారు యోగవాసిష్టంలో “విచారణే పరమజ్ఞానం” అన్నారు. అంటే ఎప్పటికప్పుడు విచారణ చేసుకోవాలి.

నేను దేన్ని శ్రద్ధగా చేస్తున్నాను? సాధన శ్రద్ధగా ఉందా? జ్ఞానం శ్రద్ధగా ఉందా? నాది అన్నది నేను పరోపకారం కోసం ఖర్చు పెడుతున్నానా? లేదా? అని విచారణ చేసుకోవాలి. ఈ సృష్టి అంతా ఈశ్వరునిదే  అని చెప్పారు కదా? మరి నాకు ఇవ్వబడింది పదిమందికి ఇవ్వడానికి భగవంతుడు నాకు అవకాశం ఇచ్చాడు అని అనుక్షణం అనుకోగలిగితే  వినయం పెరుగుతుంది.

"ఎంత వినయంగా వుంటే అంతగా ధ్యానంలో పెరుగుతూ ఉంటారు". ఎదిగే కొద్ది మొక్క ఒదుగుతుంది అంటారు, అలాగే మీరు ఎంతగా ఎదుగుతారో అంతగా ఒదిగి ఉండాలి. ఒదిగి ఉన్నప్పుడు ఇంకా ఇంకా ఎదుగుతారు. **"వినయం ఊర్ధ్వ లోకాలకి తీసుకుని వెళ్తుంది. అహంకారం అధో లోకాలకి తీసుకుని వెళ్తుంది".** అందుకే ప్రతి సాధకుడు సాత్విక శ్రద్ధలోనే ఉండాలి.

ధ్యాన మార్గంలోకి రానప్పుడు ఏ శ్రద్ధలు ఉన్నాయో అనవసరం. కానీ సాధనా మార్గంలోకి వచ్చినప్పుడు ఒకటే గమనించుకోవాలి, సాధన అంటే జ్ఞానం పెంచుకోవడానికి, పరమాత్మని చేరుకోవడానికి అని తెలుసుకోవాలి.

నువ్వు ఎంత జ్ఞానవంతుడవైనా **"సేవకు, ప్రేమకు, త్యాగానికి దూరం అయితే అహంకారం పెరుగుతూ ఉంటుంది".** త్యాగము ఉండాలి, ప్రేమ ఉండాలి, సేవ ఉండాలి. ఈ మూడింటి వల్లే వినయం వస్తూ ఉంటుంది. ఈ వినయంతోనే పరమాత్మకి దగ్గర అవుతారు. ఇది నేను చేయట్లేదు, త్రికరణ శుద్ధిగా ఆయన్ని చేరాలని నేను ధ్యానం చేస్తున్నాను కాబట్టి నేను మాయకి వశం కాకుండా ఉండేటట్టు ఆయన కాపాడుతున్నాడు అనేది ఎప్పుడూ గుర్తుండాలి.

సాత్విక గుణం పెంచుకోవడానికి శ్రద్ధ చూపించాలి. అప్పుడే సాధన, జ్ఞానం పెరిగి పరమాత్మకి దగ్గర అవుతారు. అందుకే ఉండాల్సింది తామసిక శ్రద్ధ కాదు, రాజసిక శ్రద్ధ కాదు, అందరికీ ఉండాల్సింది సాత్విక శ్రద్ధ అని తెలుసుకోవాలి.

# ఆత్మజ్ఞానులు అవ్వాలంటే?

సహజంగా అన్ని విషయాలు తెలిసినట్టే ఉంటాయి కానీ కొన్ని పరిస్థితులలో వాటిని మర్చిపోయి ప్రవర్తిస్తూ ఉంటారు. నేర్చుకున్నది జీవితంలో యథాతథంగా ఆచరించగలిగితే గురువులు అనుకున్న స్థాయికి ఎదిగినట్టే.

అందుచేత ఎంతవరకు ఆచరిస్తున్నాను? నేను జీవుడులా కాదు, దేవుడిలా ఉండడానికి ఏం చేయాలి? నా ప్రవర్తన ఎలా ఉండాలి? అన్నది తెలుసుకోవాలి. ఆచరణలో పెట్టగలిగాలి.

అంతే కానీ సాధన చేసి నాలుగు మాటలు చెప్తే మీరు జ్ఞానులు కాలేరు, ప్రతిదీ ఆచరణలో ఉండాలి. దానికి సాధన చేసి మనసులో వున్న మురికిని పోగొట్టుకుని, బుద్ధి వికసింపచేసుకుని, అంతర్ ప్రజ్ఞ పెంచుకున్నప్పుడే జ్ఞానాన్ని ఆచరణలో పెట్టుకోగలుగుతారు.

లోకంలో ఎన్నో రకాల వారు ఉంటారు. కొంతమంది దేహ దృష్టితో ఉంటారు, కొంతమంది మనో దృష్టిలో ఉంటారు, కొంతమంది ఆత్మ దృష్టిలో ఉంటారు. ఈ ఆత్మ దృష్టిలో ఉన్నవారే జ్ఞానులు అవుతారు.

మరి ఈ దేహ దృష్టి ఉన్నవాళ్ళు ఎలా ప్రవర్తిస్తారు? మనో దృష్టి ఉన్నవాళ్ళు ఎలా ప్రవర్తిస్తారు? ఆత్మ దృష్టి ఉన్నవాళ్ళు ఎలా ప్రవర్తిస్తారో? తెలుసుకుందాం.

**1) దేహ దృష్టి ఉన్న వాళ్ళు:-** ఒక వ్యక్తిని చూసి వీళ్ళు నల్లగా ఉన్నారు, వీళ్ళు తెల్లగా ఉన్నారు, వీళ్ళు పొడుగ్గా ఉన్నారు, వాళ్ళు పొట్టిగా ఉన్నారు, అని వాళ్ళ బాహ్య రూపాన్ని అంటే కనబడుతున్న రూపాన్ని విశ్లేషించే వాళ్ళందరూ కూడా దేహ దృష్టితో ఉన్నవారే. ఇంక వాళ్ళు అంతకంటే ముందుకు వెళ్ళలేరు. వీరు జ్ఞానులు అవ్వడానికి చాలా టైం పడుతుంది.

**2) మనోదృష్టి ఉన్నవాళ్ళు:-** ఈ మనోదృష్టి గలవారు వీడు గొప్పవాడు, వీడు పండితుడు, వీడు రాజకీయ నాయకుడు లేదా వీడికి గొప్ప కళలు వచ్చు అని

వాళ్ళలో ఉన్న గొప్పతనాన్ని చూస్తారు. కాని ఇవన్నీ ప్రాపంచిక గొప్పలే. అంటే వాళ్ళ డబ్బు చూసి, వాళ్ళకి ఎన్నో ఉన్నాయి అని లెక్క వేసుకుంటూ ఉంటారు. అంటే వాళ్ళ మనసుల్లో ఆ విధంగా ఎదగడానికి ప్రయత్నించారు కాబట్టి అలా ఎదిగిన వాళ్ళని చూసి గొప్ప వాళ్ళుగా భావించి పదే పదే ఆ విషయాల్ని ప్రస్తావిస్తూ ఉంటారు. ఇది మనో దృష్టి.

ఇప్పుడు భూమ్మీద ప్రాపంచికంగా జీవిస్తున్నవారు అంతా ఈ రెండు దృష్టిలతోనే ఉన్నారు. అందుకే ఒక సినిమా యాక్టర్ వచ్చినా, ఒక రాజకీయ నాయకుడు వచ్చినా జనం విరగబడి వెళ్తారు.

**3) ఆత్మ దృష్టి ఉన్నవాళ్ళు:-** "ఆత్మ దృష్టి కలవాళ్ళు అందరిలోని ఆత్మని దర్శిస్తారు, అందరూ వీళ్ళకి ఆత్మ స్వరూపులుగానే కనబడతారు". వీళ్ళకి ఎదుటివాడు గొప్పవాడా? పేదవాడా? రాజకీయ నాయకుడా? ధనవంతుడా? వాడికి ఎన్ని ఆస్తులు ఉన్నాయి? ఇవన్నీ అవసరం లేదు. అందరిలో ఆత్మని దర్శించిన వాడే జ్ఞాని అని భగవద్గీతలో కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది.

**శ్లో॥ విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పండిత: సమదర్శిన: ॥ (భ.గీ.5 -18)**

ఒక జ్ఞాని బ్రహ్మ విద్యను నేర్చుకున్న బ్రాహ్మణుడి యందు, కుక్క మాంసం తినే ఛండాలుడి యందు అంటే అధమాతి అధముడి స్థాయి కలవాడి యందు ఆత్మనే దర్శిస్తాడు. అలాగే జంతువుల్లో గొప్ప స్థాయి అయిన ఆవు యందు, మధ్యమ స్థాయి అయిన ఏనుగు యందు, అధమ స్థాయి అయిన కుక్క యందు ఆత్మనే దర్శిస్తున్నాడు. అలా సర్వ జీవులలో ఆత్మను దర్శించగలిగిన వాడే పండితుడు అంటే జ్ఞాని.

జ్ఞాని ఎప్పుడూ ఎదుటివాడి ప్రవర్తనను బట్టి నాకు వీడు నచ్చాడు, వాడు నచ్చలేదు అనడు, సమ భావంతో ఉంటాడు. వేదాలు చదివే వాడు గొప్పవాడు కాదు, చదివినవి ఆచరణలో పెట్టుకున్న వాడు గొప్పవాడు.

అందుకే "భగవంతుడు బాహ్య ప్రియుడు కాదు, భావ ప్రియుడు"

అంటారు. బాహ్యంలో గొప్పగా ఉంటూ భావం మాత్రం అధమ స్థితిలో ఉంటే వాడు గొప్పవాడు కాదు.

గోమాత గొప్పది కాబట్టి పూజ చేస్తారు, మేక, కోడి, చేప తక్కువ కాబట్టి తింటాను అంటే వీళ్ళకి వీళ్ళు గొప్పవాళ్ళు అనుకోవచ్చు కాని భగవంతుని దృష్టిలో గొప్పవారు కాలేరు. పత్రి గారు అన్నీ ఆత్మ స్వరూపాలే, "పిపీలాది బ్రహ్మ పర్యంతం" అంటే ఒక చీమ నుంచి బ్రహ్మ దేవుడు వరకు అందరూ ఆత్మ స్వరూపులే అని, అసలు సిసలైన సత్యాన్ని మనకి బోధించారు. "సృష్టిలో మానవులే కాదు సకల చరాచర జీవులు కూడా ఆత్మ స్వరూపులే" అని అర్థమయ్యేలా చెప్పి ధ్యానంలోకి తీసుకువచ్చి మన దృష్టి ఆత్మ మీదకి మళ్ళించారు.

ధ్యానం చేసినా, జ్ఞానం విన్నా  ఎక్కట్లేదు అంటే సాధన ద్వారా గ్రహణ, శ్రవణ శక్తిని పెంచుకోలేకపోతున్నారు. కారణం  శ్రవణంలో మూడు రకాలు ఉంటాయి.

1) అధమం, 2) మధ్యమం, 3) ఉత్తమం

**1) అధమ శ్రవణం:-**

అధమ శ్రవణుడు తనకు తాను కూడా ఉపయోగపడడు. గురువు చెప్పిన మాటల్ని ఆచరించలేడు. ఎంతసేపూ ధ్యానం చేస్తే ఆరోగ్యం బాగుంటుంది, ధ్యానం చేస్తే సంకల్పాలన్నీ నెరవేరతాయట అని ఆరోగ్యం కోసం, సంకల్పాలు నెరవేర్చడం కోసం చేసే ధ్యానాలలో  ఆత్మ జ్ఞానం రాదు. ఆత్మ జ్ఞానం రాకపోతే సమత్వ భావన ఉండదు, సత్యానికి చేరువ కాలేరు.

ఈ భూమి మీద మీ ప్రవర్తనను బట్టే పరమాత్మకి దగ్గర కాగలరు. భూమ్మీద గురువు మాటలు విని ఎంత సత్యంలో జీవిస్తారో అప్పుడు  సత్యానికి అంత చేరువవుతారు. గురువులు ఎంత చెప్పినా, శాస్త్రాలు ఎంత చెప్పినా, ధర్మం ఎంత బోధించినా, ఆత్మ గొప్పది అని తెలుసుకున్నా నువ్వు త్రికరణ శుద్ధిలేకుండా, కోరికలు కోరుతున్నావు అంటే అధమ శ్రవణం  అంటారు.

**2) మధ్యమ శ్రవణం:-**

తనకు తానుగా సాధన చేసుకుని కొన్ని ఫలితాలు పొందుతాడు. నేను ఆత్మని అని తెలుసుకుంటాడు కానీ సేవా భావం ఉండదు, మోక్షం రాదు. ఇది మధ్యమ శ్రవణం.

**3) ఉత్తమ శ్రవణం :-**

తాను జ్ఞానవంతుడు అవుతూ, అందరినీ జ్ఞానవంతుల్ని చేయడానికి ప్రయత్నిస్తాడు. గురువు లాగే తాను కూడా ఆ మార్గంలో పయనిస్తూ పది మందికి ఆత్మ జ్ఞానం బోధిస్తాడు. . అలా పది మంది కోసం పాటుపడితే అది ఉత్తమ శిష్యుడి లక్షణం, అందుకే సేవ అంటే పరమాత్మకి చాలా ఇష్టమైన పని. సేవ, త్యాగం, ప్రేమ ఈ మూడు చాలా బ్రహ్మాండమైన ఆయుధాలు.

ప్రపంచానికి సేవ చేస్తున్నాను అంటే అక్కడ శరీరం చూడరు, మనసు చూడరు, అన్ని జీవులు ఆత్మ స్వరూపులే అని గురువు చెప్పాడు అందుకే సర్వజీవుల్ని ప్రేమిస్తారు. అలాగే సమయాన్ని, డబ్బుని, వాక్కుని త్యాగం చేసి సాటి వాళ్ళు కష్టాల్లో, దుఃఖంతో ఉన్నప్పుడు వాళ్ళ అజ్ఞానం తొలగించడానికి కాస్త జ్ఞానం నేర్పడమేకాదు ఈ దుఃఖానికి, కష్టానికి కారణం అజ్ఞానంతో చేసిన తప్పుడు పనులే, పాపపు పనులే అని వాళ్ళకి తెలియజెప్పి, వాళ్ళూ ఆత్మ స్వరూపులని గ్రహించేటట్టు వివరించి, వాళ్ళ చేత ధ్యానం చేయిస్తే జ్ఞానులు అవుతారు.

అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు పండితా సమదర్శినః అన్నాడు. ఆత్మ సర్వవ్యాపి అంతటా, అన్నిటా ఉన్నది ఆత్మే.

అందుచేత “సర్వ జీవుల సేవ సర్వేశ్వరుడి సేవ” అన్నారు. మరి అన్ని జీవులకి సేవ చేస్తే ఆత్మకు సేవ చేసినట్టే. ఆ సర్వేశ్వరుడే భూమి మీదకి ఆత్మలను సృష్టించి పంపిస్తున్నాడు. అందరూ ఆయన అంశలమే. ఈ అంశాత్మలు పూర్ణాత్మలుగా ఎదగాలంటే ఈ భూమి అనే పాఠశాలలో జ్ఞానము పొందాలి.

సద్గురువు మాటని ఉత్తమ శ్రవణంగా స్వీకరించి ప్రక్క వాళ్ళతో

కూడా ఆచరింప చేయడానికి ప్రయత్నించాలి. మరి "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్నప్పుడు సకల జీవుల్ని ప్రేమిస్తూ ఆత్మ దృష్టిని మరింతగా విస్తరింప చేసుకోవాలి.

తుకారాం ఇంట్లో కూర్చుని పాండురంగడి పాటలు పాడుకునే వాడట. వాటినే అభంగాలు అంటారు. అలా పాడుకుంటుంటే ఒకరోజు కుక్క వచ్చి అన్నం తీసుకువెళ్ళిపోతుంటే తుకారాం అన్నాడట, పాండురంగా...ఆగు ఆగు. ఉత్తి అన్నం ఎలా తింటావు? కొంచెం నెయ్యి వేస్తాను అని. అలా ఆ కుక్కలో కూడా పాండురంగడ్నే దర్శించి తుకారాం శరీరంతో స్వర్గానికి వెళ్ళగలిగాడు అంటే భూమి మీద మన మాట, ఆలోచన, చేత అన్నీ కూడా సృష్టి అంతా ఆత్మ స్వరూపమే అన్న విధంగా ఉండాలి.

మీకు ఏ జీవినీ బాధ పెట్టే హక్కు కానీ, హింస చేసే హక్కు కానీ లేదు. ఆత్మగా భూమి మీదకి వచ్చిన మీరు రకరకాల శరీరాలు ధరించి పాఠాలు నేర్చుకొని చిట్టచివరగా మానవ జన్మలోకి ప్రవేశించి, ఆఖరి జన్మలో గురువు ద్వారా ఆత్మ జ్ఞానం నేర్చుకొని దేవుడిగా ఎదిగి శరీరం వదలాలి. జీవుడిగా వచ్చిన వారు దేవుడిగా ఎదగాలి.

మరి గురువు ప్రక్కనుండి ఎన్ని చెప్తున్నా, గత జన్మ వాసనల వల్ల, సంస్కారాల వల్ల ఇంకా ప్రపంచం వైపే మొగ్గు చూపుతున్నారంటే? కచ్చితంగా ధ్యానం ఉన్నా సరియైన జ్ఞానం పొందలేదనే లెఖ్ఖ.

కానీ భగవంతుడి నియమం భూమి మీదకి వెళ్లి, తానే భగవంతుడు అని తెలుసుకునే వరకు భూమి మీద జన్మలు తీసుకోవలసిందే! అందుకే శారీరక దృష్టి, మానసిక దృష్టి తగ్గించి ఆత్మ దృష్టిని పెంచుకోవాలి. ఆ ఆత్మ దృష్టిని పెంచుకుంటేనే ఆత్మ జ్ఞానం, పెంచుకుని దైవాలుగా ఎదిగి సత్య లోకానికి వెళ్తారు.

# సత్యం, ధర్మం ఎప్పుడు నశిస్తుంది?

సత్యము, ధర్మము అనే పదాలు మనం మాట్లాడుతున్నాం, ఉపయోగిస్తున్నాం. కానీ ఆ సత్యము, ధర్మము ఎప్పుడు నశిస్తుంది? ఎలా నశించిపోతుంది? అన్నది తెలుసుకుందాం. ధర్మం ఆచరించవలసిన విషయం, సత్యం తెలుసుకోవలసిన విషయం. అయితే ధర్మాన్ని అందరికీ బోధిస్తూ, మాటల్లో వ్యక్తపరుస్తూ, ఆ ధర్మం ఆచరించకపోతే ధర్మం నశించిపోతుందట.

చాలామంది ధర్మాన్ని చెపుతారు కానీ వాళ్ళ జీవితాల్లో ఆచరణ ఉండదు. ఎప్పుడైతే ధర్మాన్ని ఆచరించలేరో అప్పుడు ఆ ధర్మం నశించిపోతుంది అని మన శాస్త్రాలు చెప్పడం జరిగింది. మరి ధర్మాన్ని కాపాడతామని పీఠాలెక్కిన పీఠాధిపతులు కూడా అర్థ, కామాలకి ఆశపడి, ఆకర్షణలో ఉన్నప్పుడు ధర్మాన్ని ఆచరించకుండా, ధర్మం తెలిసున్నా చెప్పకుండా, సత్యం తెలిసున్నా చెప్పకుండా ఉంటే వారిలో ధర్మం క్షీణించిపోతుంది.

ప్రతివాడికి సత్యం తెలియజేయాలి, సత్యం తెలుసుకున్నవాడే ధర్మాన్ని ఆచరించగలడు అని ఆ జగద్గురువులకి తెలుసు కాబట్టే పీఠాలు స్థాపించడం జరిగింది. మరి ఎందుకు చెప్పట్లేదు అంటే? వాళ్ళు చెప్పేది ఒకటే మాట! వాళ్ళకి అర్థం చేసుకునే అంత స్థాయి లేదు అందుకే వాళ్ళకి ఇదే సరిపోతుంది అని అసత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

అందుకే జనం సత్యాన్ని తెలుసుకోక అసత్యంలో జీవిస్తూ అదే సరియైనది అనుకుంటూ ధర్మాచరణకు దూరమైపోయారు. సత్యాన్ని తెలుసుకున్న వాడే ధర్మాన్ని ఆచరించగలడు. తప్పు ఎక్కడ జరుగుతుందంటే? ధర్మాన్ని రక్షిస్తామని పీఠాలెక్కి, వేదికలెక్కి ఉపన్యాసాలు చెప్పిన వాళ్ళు దాన్ని కాపాడలేక పోయారు. ఎందుకు అంటే? మాయా ప్రభావమే అనుకోవాలి.

మానవుడిలో ఎప్పుడైతే స్వార్థ బుద్ధి బయలుదేరిందో ధర్మాన్ని ఆచరించలేడు. ఆశ, స్వార్థం ఇవన్నీ మనిషిలో ఎప్పుడైతే ప్రవేశిస్తాయో అప్పుడు

మాయకి వశమవుతారు. ఆశ ఉండటం సహజమే కానీ ఇప్పుడు ఆశను దాటి అత్యాశలోకి ప్రవేశిస్తున్నారు. అత్యాశ మరీ దారుణం. ఎవరు ఈ అధర్మాన్ని రూపుమాపగలరు అంటే? మనల్ని సృష్టించిన భగవంతుడే ఈ అధర్మాన్ని రూపుమాపాలి. ఈ అధర్మాన్ని రూపుమాపాలని, అసత్యాన్ని రూపుమాపాలని ఆ భగవంతుడే  అవతారాలుగా కానీ, సద్గురువులుగా కానీ భూమిమీద అవతరించి సత్యం చెప్పి, ధర్మాన్ని కాపాడుతున్నాడు.

ఏది సత్యము అంటే నశింపులేనిది సత్యం. ఏది నశించనిది? అంటే భగవంతుడు ఒక్కడే నశించనివాడు. మరి భగవంతుడు ఎక్కడ ఉంటాడు? అంటే మామూలుగా మనం ఊహ తెలిసినప్పటి నుంచి విగ్రహాల్లో ఉన్నాడు, గుళ్ళల్లో ఉన్నాడు అని చెప్పుకుంటున్నాం. ఆ విగ్రహాలు రాతి నుంచి మనం తయారుచేసుకున్నవి.

అతి స్వల్పమైన చైతన్యం గల విగ్రహాలను, అత్యధిక చైతన్యం గల మానవుడు ఆశ్రయించినా సత్యం తెలుసుకోలేడు కాబట్టి గురువులు విడమరిచి సత్యం అంటే ఇది, శాశ్వతమైనది, ఆ సత్యం, ఆ దైవం ఎక్కడో లేడు నీలోనే ఆత్మగా ఉన్నాడు. నువ్వు దైవాన్ని తెలుసుకోవాలంటే బాహ్యంలో వెతికితే దొరకడు, నువ్వు అంతరంలోకి వెళితేనే దొరుకుతాడు అని ఆ పరమ సత్యాన్ని గురువులు  ప్రజలకు చెప్పారు.

అయితే ఆ స్థాయి లేని వాళ్ళు అర్థం చేసుకోలేకపోతున్నారు. గురువులు వచ్చి ధర్మం గురించి, సత్యం గురించి చెప్పినా ఆచరణలో పెట్టుకోలేక పోతున్నారు. అంటే వీళ్ళు బలంగా మాయకి వశం అవుతున్నారు. ఎందుకు మాయకి వశమైపోతున్నారు అంటే? వాళ్ళ గుణాలను మార్చుకోలేక, తమోగుణం, రజోగుణంలో ఉండడమే! వాళ్లే మాయకి వశమై ధర్మానికి, సత్యానికి దూరమవుతారు. సత్వగుణంలో ఉన్నవాళ్లు మాయ నుంచి బయట పడతారు.

లేనిది ఉన్నట్టు భ్రాంతి చెందడమే మాయ అని ఎన్నో ఉదాహరణల ద్వారా గురువులు మనకి తెలియజేయడం జరిగింది. అయినా సరే ఇంకా

అసత్యాన్ని, అధర్మాన్ని ఆశ్రయిస్తున్నారు. ఆత్మే దైవం, ఆత్మని చేరుకునే ఏకైక మార్గం ధ్యానము అని గురువుగారు మనకి చెప్పినప్పుడు, దైవం మీద ప్రీతి ఉన్న ప్రతి ఒక్కరు కూడా ధ్యాన మార్గాన్ని ఆశ్రయిస్తారు, ఆ ధ్యానంలోనే ముందుకి వెళ్తారు.

దైవం మీద ఎంత తీవ్రాతి తీవ్రమైన ప్రేమ ఉంటుందో, భక్తి ఉంటుందో, ఇంక వాళ్ళు జీవితంలో ధ్యానం అనేది మానరు. కానీ చూడండి మనం ఎంతగా ఎదుగుతామో మాయ తన ప్రభావాన్ని అంతగా చూపిస్తుంది. అంటే భగవంతుడి చేతిలో మాయ ఉంది కాబట్టి మన సాధన సరిగ్గా ఉందా? కష్టం వస్తే ఆగిపోతామా? అని మనకు కష్టాల రూపంలో పరీక్షలు పెడుతూ వుంటాడు.

ఎన్ని పరీక్షలు పెట్టినా కష్టాలు రానివ్వండి, బాధలు రానివ్వండి, ఏదైనా రానివ్వండి, ఎప్పుడైతే ధ్యానం వదలకుండా చేస్తారో! అప్పుడు సత్యాన్ని ప్రేమిస్తున్నట్టు, సత్యాన్ని ఆశ్రయిస్తున్నట్టు. కాని ధ్యానంలోకి వచ్చాక మాకేం కలిసి రాలేదు, ఇంకా కష్టాలు పెరిగిపోతున్నాయి, దానికంటే పూజలు చేసుకుంటేనే హాయి అనే అజ్ఞానకరమైన ఊహలు మీ మదిలోకి వచ్చాయి అంటే మీరు మాయకి వశమై, సత్యానికి, ధర్మానికి దూరమైపోతున్నామని తెలుసుకోవాలి.

ఈ మార్గంలో పరీక్షలు ఉంటాయి. ఎందుకంటే ప్రాపంచిక వస్తువులు కొంటున్నప్పుడే పరీక్షించకుండా ఏది కొనుక్కోరు. దాని క్వాలిటీ ఎంత? అది ఎన్నాళ్ళు మన్నుతుంది? ఎలా ఉంటుంది అని చూస్తారు.

మీ పిల్లల్ని ఒక స్కూల్లో వేయాలంటే నాలుగు రకాల స్కూల్స్ తిరిగి ఎక్కడ బాగా చదువు చెప్తారు? ఎక్కడ బాగా క్రమశిక్షణ ఉంది? అని ఆలోచించి స్కూల్స్ లో వేస్తున్నారు. మరి నువ్వు పరమాత్మని చేరుకోవాలని ఈ మార్గంలోకి వచ్చావు, భూమిమీద ఉండగానే నువ్వు ధర్మంగా ఉన్నావా? కష్టం వచ్చినా సత్యాన్ని విడవకుండా ఉన్నావా? అని నీకు కష్టాలు, బాధలు అనే పరీక్షలు

పెట్టి నువ్వు ఉంటావా? దాటిపోతావా? అని చూస్తాడు.

శ్రేయో మార్గాన్ని చేరాలి అంటే ఎంత కష్టమో ఒక్కసారి తెలుసుకోండి, ఊరికే మూడు అక్షరాల మార్గం కాదు ఇది. జీవుడు ప్రేయో మార్గానికి వెళ్ళడానికే ఇష్టపడతాడు కానీ శ్రేయో మార్గంలో ఉన్న కష్టాలని అనుభవించడానికి ఇష్టపడడు. అందుకే భగవద్గీతలో

**శ్లో॥ మనుష్యాణం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే!**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మామ్వేత్తి తత్వతౌ!! ( భ.గీ. 7-3 )**

తా: - వేలాది మంది మనుష్యులలో ఒకానొకరు మోక్ష సిద్ధి కొరకు ప్రయత్నిస్తారు. అలా ప్రయత్నించే వేల మందిలో ఒకానొకడు మాత్రమే నన్ను యదార్ధంగా తెలుసుకోగలుగు తున్నాడు.

అంటే శ్రేయో మార్గాన్ని చేరుకోవాలి అంటే సహనం, భగవంతుడి మీద భక్తి, ప్రేమ ఇవన్నీ మనలో ఉన్నప్పుడు ఎన్ని కష్టాలు ఉన్నా సత్యాన్ని విడవకుండా పట్టుకుంటారు. ఎప్పుడైతే అలా సత్యాన్ని పట్టుకున్నారో ప్రాపంచిక జీవితంలో ధర్మపరమైన జీవితాన్ని జీవిస్తారు.

పొలంలో పైరు వేశాక ఆ పంటని పెంచడానికి ఇంటికి వచ్చేవరకు రైతు ఎంతో కష్టపడతాడు. కానీ కలుపు మొక్కలు పెంచడానికి పెద్ద కష్టపడాల్సిన అవసరం లేదు. వాటికి అవే మొలుస్తాయి, పొలాన్ని పాడు చేస్తాయి.

అలాగే సత్యాన్ని తెలుసుకోవడానికి, ధర్మాన్ని ఆచరించడానికి జీవుడు ఎంతో కష్టపడాలి. కాని మానవుడిలోని అసత్యం, అధర్మం కలుపు మొక్కల్లా కష్టపడకుండానే వచ్చేస్తాయి. ఎందుకంటే సుఖ భ్రాంతి, సుఖలాలాస ఉన్నవాళ్ళు అధర్మంలో జీవిస్తారు, అసత్యాన్ని ఆశ్రయిస్టారు. అలా ప్రాపంచిక సుఖాలు, భోగాలు కావాలనుకున్న వాడికి యోగం కుదరదు అని చెప్తారు.

మరి భారతంలో కౌరవ పాండవుల కథ చూస్తే తనది కాని రాజ్యాన్ని తనదని యుద్ధానికి కారణమయ్యాడు ధృతరాష్ట్రుడు. రాజ్యం తనది కాదు, అది తమ్ముడి కొడుకులకు అప్ప చెప్పాలి. ఎందుకంటే? గుడ్డివాడు కాబట్టి

ఆయనకి రాజ్యార్హత లేదు. పాండురాజుకే పట్టాభిషేకం జరిగింది కాబట్టి వాళ్ళ పిల్లలే రాజులు కావాలి, అది ధర్మం. ధర్మం తెలిసినా దృతరాష్ట్రుడు మమకారం వదులుకోలేక తన పిల్లలే చక్రవర్తులు కావాలని అధర్మంగా, అన్యాయంగా ఆలోచించడం వల్ల అన్ని అనర్థాలు జరిగాయి. చిట్ట చివరికి ప్రజా నాశనం జరిగింది.

ఈ నాశనానికి కారణం కృష్ణుడని గాంధారి నింద వేసింది కానీ ఆలోచిస్తే ధృతరాష్ట్రుడి అధర్మపరమైన ఆలోచనే దీనికి కారణం. మరి ధర్మాన్ని కాపాడుకోవాలి అంటే సరైన ఆలోచనా విధానం ఉండాలి. ధర్మాన్ని ఆచరించాలంటే? ముందు సత్యం తెలుసుకోవాలి. సత్యం అంటే భగవంతుడు. భగవంతుడు ఎవరు? ఆత్మే భగవంతుడు. ఎక్కడ ఉంటాడు? అన్ని జీవులలోను అంతర్యామిగా ఉన్నాడు. అన్ని జీవులలోనే కాదు సృష్టి మొత్తం ఆయనే ఉన్నాడు.

"అహం బ్రహ్మాస్మి", "తత్వమసి", "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే మాటలు మనం తెలుసుకున్నాం కానీ, ఆ భగవంతుడు మన ప్రక్కనే ఉన్నాడు, మన కూడా ఉన్నాడు, మన ఇంటా, వెంటా, జంటగా ఉన్నాడు అనే ఎరుకను కోల్పోయి, ఒక్కొక్కసారి మమకారాలు ఎక్కువైనప్పుడు వ్యామోహంతో లేదా అహంకారం ఎక్కువైనప్పుడు నేను ఏం చేసినా చెల్లుతుందని అధర్మంగా ఆలోచిస్తూ ఉంటారు.

ఎందుకంటే అద్వైత బుద్ధి ఉన్నప్పుడు మన ఆలోచనలు పరమాత్మ వైపుకి, ద్వైత బుద్ధి ఉన్నప్పుడు ప్రపంచం వైపుకి వెళ్తాయి. అందుకే శుద్ధ బుద్ధి ఉన్నవాడు చక్కగా ధర్మాన్ని తెలుసుకుంటూ, సత్యాన్ని ఆచరిస్తూ సుఖవంతమైన జీవితం జీవిస్తాడు. మరి అధర్మాన్ని ఆచరిస్తున్నవాడు ప్రపంచం వైపు అడుగులు వేస్తూ ఎంత సంపాదించినా చిట్ట చివరికి దుఃఖంలోనే ఉంటాడు.

అందుకే మన పెద్దలు చెప్తారు **"ధర్మాన్ని నువ్వు రక్షిస్తే ఆ ధర్మమే నిన్ను దైవమై రక్షిస్తుంది",** ధర్మం దైవం అవ్వడం అంటే భగవంతుడికి ఇష్టం ధర్మం. ధర్మాన్ని ఎవరు తప్పినా శిక్ష తప్పదు. భగవద్గీతలో చెప్పాడు కదా?

**శ్లో॥ పరిత్రాణాయ సాధునాం వినాశాయ చ దుష్కృతామ్**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే (భ.గీ.4-8)**

తా: సాధు సజ్జనులను సంరక్షించుట కొరకు, దుర్మార్గులను వినాశమొనర్చుట కొరకును ధర్మము స్థాపించుట కొరకు నేను ప్రతి యుగమున అవతరించుదును.

సాధువులు అంటే సత్యాన్ని తెలుసుకున్నవాళ్లు, పవిత్రమైన వాళ్ళు అంటే సత్యంలో జీవిస్తున్న వాళ్ళు. సజ్జనులు అంటే **"సత్యం కోసం ప్రయత్నిస్తున్న వాళ్ళకి హాని కలిగించడమే ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించడం".** సత్యానికి హాని కలిగించడం అంటే ధర్మాన్ని వదిలి అధర్మంలో జీవించడం.

పూర్వం ఋషులు తపస్సు చేసుకుంటే రాక్షసులు వాళ్ళని బాధ పెట్టేవారట. అప్పుడు ఎవరో ఒకళ్ళు వచ్చి వాళ్ళని కాపాడుతూ ఉంటారు. ఎందుకంటే వాళ్ళు ఎవరి జోలికి వెళ్ళరు, వాళ్ళ ధర్మాన్ని వాళ్ళు పాటిస్తున్నారు. కానీ ఆ ధర్మానికి హాని కలిగించే రాక్షసులు సంహరింపబడ్డారు. అందుకే ధర్మాన్ని ఆశ్రయించిన వాడికి జీవితంలో ఆ ధర్మమే దైవమైపోతుందట.

అందుకే ధర్మానికి ఎప్పుడూ హాని కలిగించకూడదు. ఎదుటివాడికి మాటల్లో చెప్పడం కాదు, ధర్మము అంటే నువ్వు ఆచరించి ఆ ఆచరణలో పొందిన ఫలితాన్ని ప్రక్కవాడికి చెప్పాలి. అంతేకానీ మాటలు మాట్లాడి చేతల్లో లేకపోతే ధర్మమే అధర్మం అయిపోతుంది.

అందుకే పత్రిగారు నేర్పిన ధర్మం ఏమిటంటే? జీవ హింస చేయకూడదని. అందుకే **"భూమి మీద ధర్మాన్ని ఆచరించిన వారు చాలా తొందరగా సత్యానికి చేరువవుతారు".** వాళ్ళ జీవన విధానమే సత్యం అయిపోతుంది.

అందుకే గురువులు భూమి మీదకు వచ్చి మొట్టమొదటిగా ధర్మం అంటే ఏమిటో చెప్తారు. చెప్పకుండా ధ్యానం చేసేయండి అని చెప్పరు. ప్రాపంచిక ధర్మాలూ చెప్తారు, ఆధ్యాత్మిక ధర్మము చెప్తారు. సంసారంలో ఉన్నా, సంఘంలో

ఉన్నా నువ్వు ఎలా మసలుకోవాలో అలా మసలుకోవడమే ప్రాపంచిక ధర్మం. కానీ నువ్వు ఆధ్యాత్మిక ధర్మం ఆచరించాలి అంటే సాధన చేయాలి, భగవంతుడికి ఇష్టమైన పనులు భూమిమీద చేయాలి.

**"సత్యాన్ని ఆశ్రయించిన వారి జీవితం వైభోగమే".** అంటే వాళ్ళు తెలుసుకుంటారు, ప్రాపంచిక జీవితంలో ధర్మంగా ఉంటారు. మనము ఇన్ని తెలుసున్నా ప్రాపంచిక జీవితంలో ధర్మంగా జీవించలేకపోతే సాధన వ్యర్థం. అందుకే మన స్నేహితుల మీద ప్రేమ కాదు, మన కన్న పిల్లల మీద ప్రేమ కాదు అందరిని సమానంగా ప్రేమించగలగాలి. అలా ప్రేమించగలిగారు అంటే ధర్మంగా ఉన్నట్టే.

మనం ఆ ధర్మం ఇంకా ఇంకా తెలుసుకోవాలంటే మన ప్రవర్తనని మనమే గమనించుకోవాలి, ఎవ్వరు బయట నుంచి పాఠాలు చెప్పరు. నిన్ను నువ్వు గమనించుకుంటూ నీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనిస్తూ సత్యంలో జీవిస్తూ, ధర్మం ఆచరిస్తూ బ్రతకడమే యోగి లక్షణం. అలాగే ప్రాపంచిక జీవితంలో స్వార్థ బుద్ధి వదిలి త్యాగ బుద్ధితో ఉండగలిగితే ధర్మాన్ని ఆచరించినట్టే.

మనం తింటే మన కడుపు నిండుతుంది కానీ పది మందికి పెడితే దైవం మెచ్చే పని చేసినట్లు. ఇవన్నీ చేస్తున్నప్పుడు నాకు పది మందికి పెట్టే అవకాశం, పది మందికి చెప్పే అవకాశం భగవంతుడు ఇస్తున్నాడు అనుకోవాలి.

సత్యాన్ని ఆశ్రయించి, ధర్మపరమైన జీవితం జీవిస్తున్నప్పుడు ప్రాపంచికంలో పేరు ప్రతిష్టలు వస్తాయి అంటే అందరూ గొప్పవాళ్ళుగా మనల్ని గుర్తిస్తారు, మనం గొప్పగా ధనవంతులం అవ్వచ్చు, అలాగే ఎంతోమంది ఆత్మ బంధువులు కూడా ఉంటారు. మన చుట్టూ మనల్ని ప్రేమించే వాళ్లే ఉంటారు. కాబట్టి మనం కూడా అందరినీ ధ్యానం వైపు మరల్చి ఆత్మజ్ఞానులుగా, బ్రహ్మజ్ఞానులుగా తయారు చేయడానికి కృషి చేయగలగాలి. ఈ విధంగా సత్యాన్ని, ధర్మాన్ని ఆచరిస్తూ ఇంకా ముందుకి వెళ్ళగలగాలి.

# పరా ప్రకృతి - అపరా ప్రకృతి

భగవంతుడి గురించి ఎన్నిసార్లు, ఎన్ని విషయాలు తెలుసుకుంటున్నా ఇంకా ఇంకా తెలుసుకోవాల్సింది ఉంటూనే ఉంటుంది. మరి ఈ సృష్టిని సృష్టించిన పరమాత్మ గురించి తెలుసుకోవడానికే ఈ మానవ జీవితం అని ఈ ధ్యాన మార్గంలోకి వచ్చాకే అర్థమైంది.

ఈ మార్గంలోకి రానంత వరకు ఈ మానవ జీవితం చాలా గొప్పది, ఈ జీవితం అనుభవించడానికి, ఎంజాయ్ చేయడానికి అని అనుకుంటారు. ఎవరికైనా అందం ఉంటే గొప్ప, డబ్బు ఉంటే గొప్ప, పదవులు ఉంటే గొప్ప, డిగ్రీలు ఉంటే గొప్ప అనుకుంటూ భూమ్మీదకి ఎందుకు వచ్చారో, దేనికి వచ్చారో తెలుసుకోకుండా, అనుభవించడానికే వచ్చాము అని అనుకుంటూ బ్రతుకుతారు.

కానీ, ఏ పూర్వ జన్మ పుణ్యమో మీకు తెలియకుండానే మీ  జీవితంలోకి సద్గురువులు వచ్చాక ఈ జీవితం ఎందుకు? ఏమి చేయడానికి? మానవ జన్మ కారణం ఏమిటి? ఇవన్నీ అర్థమైనప్పుడు ఈ జీవితం ఎంతో అద్భుతంగా ఉంటుంది.

అందుకే **"కోటి జన్మలెత్తినా సద్గురువు దొరకకపోతే నీ శరీరం లోపలే ఉన్న పరమాత్మను తెలుసుకోలేరు, మోక్షం పొందలేరు"** అని మహాత్ములు చెప్తూ ఉంటారు. పత్రిగారు మన జీవితాల్లోకి వచ్చేవరకు మన దృష్టి అంతా సంపదల మీదా, సంతానం మీదా,  బంధువుల మీదా, దేహ సంబంధమైన బంధాలతో ఉంది. కానీ, పత్రిగారు వచ్చాక బంధాలన్నీ ప్రక్కన పెట్టి మీ దృష్టి భగవంతుడి మీద పెట్టారు.

ఎవరైనా సరే జీవితంలోకి సద్గురువు వచ్చేవరకు పరమాత్మ ఇచ్చిన ఈ సృష్టినంతా అనుభవిస్తూ అసంతృప్తికరమైన జీవితం జీవిస్తారు. కానీ, ఎప్పుడైతే ధ్యాన మార్గంలోకి వస్తారో సంపదల గురించి ఆశ లేకుండా తృప్తికరమైన జీవితం జీవిస్తారు. మనం గమనిస్తే అజ్ఞానం నుంచి జ్ఞానం వైపుకు వచ్చినప్పుడు ఎప్పుడూ తృప్తికరమైన జీవితమే ఉంటుంది.

ఒకవేళ అసంతృప్తి ఉన్నా.. దేనిలో ఉంటుంది? అంటే ఇంకా జ్ఞానం పొందాలి, ఇంకా సాధన చేయాలి అనే చిన్న అసంతృప్తి ఉంటూ ఉంటుంది, అది ఉండాలి కూడా. అందుకే బుద్ధ భగవానుడు చెప్తాడు ప్రాపంచిక జీవితంలో తృప్తిగా జీవించు, ఆధ్యాత్మిక జీవితంలో అసంతృప్తితో జీవించు అని.

భూమిమీద మానవ జన్మ ఉద్దేశ్యం ఏమిటి అంటే? ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త గురించి దేహం ఉండగానే తెలుసుకోవాలి. కానీ ఆయన గురించి తెలుసుకోవాలి అంటే నిరాకారుడైన భగవంతుడు ఈ చర్మ చక్షువులకి కనబడడు. అందుకే మన స్థూల దృష్టిని సూక్ష్మ దృష్టిగా చేసుకోవాలి, అంటే కళ్ళు మూసుకుని అంతరంలోకి, ఇంకా ఇంకా లోతుల్లోకి వెళ్ళగలగాలి.

బాహ్యంగా చూసినప్పుడు మన దృష్టి అన్ని వైపులా ఉంటుంది. కానీ ఎప్పుడైతే కళ్ళు మూసుకుని “శ్వాస మీద ధ్యాస” పెట్టి ఆ శ్వాస ద్వారా అంతరంలోకి వెళ్తారో అప్పుడు పరమాత్మ దర్శనం లభిస్తుంది. చాలామంది సాధన చేస్తున్నా ఆత్మ దర్శనం లభించలేదని నిరుత్సాహపడతారు. అందుచేత సాధకునిలో నిరాశ, నిరుత్సాహం ఉండకూడదు.

అంటే ఎన్ని రోజులు చేస్తున్నా నాకేమి ఫలితం లేదు అని నిరుత్సాహ పడకూడదు. అంతేకాదు నేను చేస్తున్న ఈ సాధన సరైనది కాదేమో! ఈ సాధన లో నేను పరమాత్మను తెలుసుకోలేనేమో! ఇంకొక సాధన చేద్దామా అని నిరాశ చెందకూడదు. పరమాత్మ కృపతో నీ దగ్గరికి గురువును పంపించాడు. నేను ఈ మార్గం గుండా నీకు దొరుకుతాను అని తెలియజేయడానికే గురువుని పంపించాడు. అందుకే సాధన మీద నిరాశ, నిస్పృహలు ఉండకూడదు.

అందుకే అంటారు ఏ విద్య నేర్చుకుంటే భూమిమీద ఇంక నేర్చుకోవలసినది ఏది ఉండదో ఆ విద్య నీకు సద్గురువు వల్లే దొరుకుతుంది. అది దొరికాక నీ జీవితంలో అసంతృప్తికి తావే ఉండదు. “64 కళలు నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవలసింది మిగిలే ఉంటుంది”. కానీ, ఈ ఆత్మవిద్య, బ్రహ్మ విద్య నేర్చుకున్న వాడికి ఇక నేర్చుకోవలసిన విద్యలు ఏమీ ఉండవట. అంత గొప్పది ఈ ఆత్మ విద్య .

అంతా సృష్టిని చూసి చాలా మురిసిపోతూ వుంటారు. మరి ఆ సృష్టి ఎలా వచ్చింది? ఈ సృష్టే భగవంతుడు అనుకుంటున్నారు కొందరు. కాని కాదు సృష్టిని సృష్టించిన సృష్టికర్తే భగవంతుడు అని సద్గురువు ద్వారా తెలుసుకున్నారు. ఈ సృష్టి అంతా రెండిటి కలయికతో ఉంటుంది అదే పరా ప్రకృతి, అపరా ప్రకృతి అని మహాత్ములు మనకి చెప్పడం జరిగింది. ఇది భగవద్గీతలో కూడా ఇవ్వడం జరిగింది. ఈ అపరా ప్రకృతి, పరా ప్రకృతుల గురించి తెలుసుకుంటే దేన్ని ఆశ్రయించాలో బాగా అర్థమవుతుంది. మరి ఈ రెండిటికీ తేడా ఏమిటి అంటే?

అపరా ప్రకృతి అంటే ఈ పంచభూతాలు, సూర్య చంద్రులు మరియు మనస్సు, వీటికి చైతన్యం ఏదైతే కలిగిస్తుందో ఆ చైతన్యమే పరా ప్రకృతి అంటే భగవంతుడు, పరమాత్ముడు. ఈ పరా ప్రకృతి కనుక అపరా ప్రకృతిలో కలవకపోతే, అపరా ప్రకృతులన్నీ కూడా జడమే అవుతాయి అంటే శక్తి లేనివి అవుతాయి.

సృష్టిలో ఉన్న అన్ని జీవుల శరీరాలలో కూడా ఈ ఆత్మ అనే చైతన్యం లేకపోతే అవి జడమే. కానీ, సద్గురువులు వచ్చేవరకు ఈ విషయం తెలియక ఈ పంచభూతాల్ని, సూర్య చంద్రులని ఆరాధన చేస్తూ వుంటారు.

చూడండి ఏదైనా ఒక ఇల్లు కట్టేటప్పుడు భూమి పూజ చేస్తారు. అలాగే పుష్కరాలు వచ్చాయని పాపాలన్నీ పోయి పుణ్యం వస్తుందని నదీ స్నానాలకు వెళ్తారు. యజ్ఞ యాగాదులు చేసినప్పుడు అగ్నిహోత్రం పెడతారు, ఇలా చూసుకుంటే వాయువు లేకపోతే బ్రతకలేరని వాయుదేవుడిని ఆరాధిస్తూ ఉంటారు. రథసప్తమి వస్తే సూర్యునికి పూజ, కార్తీక పౌర్ణమి వస్తే చంద్రుడికి పూజ చేస్తారు. కాని వాటి వల్ల శక్తి వస్తుంది, కొంచెం పుణ్యం వస్తుంది, అదే వచ్చే లాభం.

చిన్న పిల్లలప్పుడు బొమ్మలాటలు ఆడుకున్నప్పుడు, బొమ్మల పెళ్లిళ్లు చేస్తున్నప్పుడు, మగబొమ్మ, ఆడబొమ్మని పెట్టి పెళ్లిళ్లు చేసి పెళ్లి పెద్దలుగా మనం వ్యవహరిస్తూ వుంటారు. కానీ, కొంచెం జ్ఞానం వచ్చాక, ఆ రెండూ

బొమ్మలే అని అర్థమయ్యాక, అవి చూడటం మాని నిజమైన పెళ్లి చూడడానికి వెళ్లారు, అలాగే ఇది కూడా.

ఏ శక్తితో వాటికి చైతన్యం వచ్చిందో, ఏ పరమాత్మ వల్ల వాటికి ఆ శక్తి వచ్చిందో తెలియనంత సేపు ఆరాధనలు చేస్తారు. కానీ, పరమాత్మే ఈ సృష్టి అంతా చేశాడు, సకల జీవులని సృష్టించాడు అని గురువు వల్ల తెలుసుకున్నారు. ఆయన ముందు పంచభూతాల్ని, ఈ ప్రకృతిని అంటే అపరా ప్రకృతిని సృష్టించాడు.

అంటే ఈ సృష్టిలో జీవుల శరీరాలన్నీ కూడా ఈ పంచభూతాలతో సృష్టించాడు. కానీ అందులో ఆత్మ అనే చైతన్యం ప్రవేశపెట్టాకే వాటికి చలనం వచ్చింది. అంటే ఈ సృష్టి అంతా పర–అపరా ప్రకృతుల కలయికే. ఈ అపరా ప్రకృతిని ఒక సాధనం లాగా, పరికరం లాగా వాడుకున్నాడు. ఆయన సృష్టిస్తాడు తర్వాత తనలోనే లయం చేసుకుంటాడు. ఇది మనం తెలుసుకున్నప్పుడు అపరా ప్రకృతిని ఆరాధించాలా? పరా ప్రకృతిని ఆరాధించాలా? అని మీరే నిర్ణయించుకుంటారు.

ధ్యానంలోకి రాకముందు మనకి ఇవేమి తెలియవు. కానీ, మీ ఎదుగుదలను మీరు పరీక్షించుకుంటే అప్పుడు అవే తెలుస్తాయి. ధ్యానం దగ్గరికి వచ్చాక కనబడేది, కనబడనిది, చూడగలిగేది, చూడలేనిది అన్నిటికీ కారణం పరమాత్మ. ఆ పరమాత్మ నాలో ఆత్మగా ఉన్నాడు, ఆయన్ని తెలుసుకోవాలంటే నేను అంతర్ముఖమైనప్పుడే తెలుసుకోగలుగుతాను అని ఈ ధ్యాన మార్గంలోకి వచ్చాక అర్థం చేసుకోగలగాలి.

అందుకే ఈ పరా ప్రకృతి తెలియనప్పుడు, అపరా ప్రకృతిని ఆరాధించారు. కానీ, భగవంతుడిని తెలుసుకోవాలి అనే ఈ తపన వల్లే పరమాత్మే గురు రూపంలో వచ్చి మనకి ఈ ధ్యాన మార్గాన్ని అందించి, ఈ ధ్యానం చేస్తేనే జ్ఞానం పొందగలమని బోధించి, భగవంతుడి సృష్టి గురించి, భగవంతుడి గురించి బోధించడం జరిగింది.

మరి "నిర్విషయ మనః ధ్యానం" అన్నారు. కాని ఈ మనసు

ఆలోచిస్తుంది, లేదా ఇంకో దాని మీదకో వెళ్తుంది. మరి గీతలో కృష్ణ భగవానుడు ఏమని చెప్పాడంటే? ఈ అపరా ప్రకృతికి సంబంధించి మనసు జడమైనది. దానికి శక్తి పరా ప్రకృతి వల్లే వచ్చింది, అంటే నా వల్లే వచ్చింది అన్నాడు. భగవంతుడి వల్ల శక్తి పొందుతున్న మనసు భగవంతుడిని చేరుకోకుండా చేస్తుంది. అది భగవంతుడి కంటే శక్తివంతమైనది కాదు. కానీ, మీరు మనసు వరకే తెలుసు కాబట్టి, భగవంతుడంటే సరైన అవగాహన లేదు కాబట్టి మనసే శక్తివంతమైనదని అనుకుంటారు.

పరా ప్రకృతి అంటే నాశనం లేనిది, సృష్టి అంతటిని చైతన్యవంతం చేసేది. ఈ అపరా ప్రకృతికి శక్తిని ఇచ్చేది పరా ప్రకృతి. అందుకే మనసుకి కూడా నా వల్లే శక్తి వస్తుంది అని గీతలో శ్రీ కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది. భగవంతుడిని చేరుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే ఈ జడమైన మనసు భగవంతుని వల్లే శక్తిని పొంది భగవంతుని చేరుకోనివ్వకుండా ఆపుతుంది.

ఇప్పుడు మీరు దారిలో ప్రయాణం చేస్తూ ఉంటే ఏదో ఒక గొయ్యి లాంటిది వస్తే దాటుకుంటూ వెళ్ళిపోతారు కానీ, గొయ్యి వచ్చిందని ఆగరు. అలాగే మీకు మధ్యలో మధ్యలో మనసు ఆలోచనలు చేస్తుంటే పట్టించు కోకుండా మీ ఆత్మ ప్రయాణం ముందుకి సాగనివ్వాలి. అంతే కాని ఆలోచనలు వస్తున్నాయని ధ్యానం ఆపడం, లేకపోతే ఆలోచనలు ఆగడానికి మ్యూజిక్కో, మాటలో పెట్టుకొని గంటలు, గంటలు కూర్చోవడం ధ్యానం కాదు.

ఈ పంచభూతాలకి, సూర్య చంద్రులకి, మనసుకి శక్తినిచ్చేది పరమాత్ముడే. ఈ రెండింటి కలయిక వల్లే సృష్టి ఏర్పడింది. ప్రకృతి కనబడుతుంది, సూర్యుడు కనబడుతున్నాడు, చంద్రుడు కనబడుతున్నాడు, పంచభూతాలు తెలుస్తున్నాయి, మనసు తెలుస్తుంది. వీటికి శక్తి దేని వల్ల వస్తుందో ఆ శక్తిని ఆరాధిస్తే నేను గొప్పవాడిని అవుతాను, జ్ఞానవంతుడు అవుతాను అని తెలుసుకోవాలి.

ఈ మార్గంలోకి వచ్చాక తెలుసుకోవాల్సింది ఏమిటంటే? జ్ఞానమంతా

ఒక్కసారే రాదు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తెలుసుకోవాలి. మరి చూడండి ప్రాపంచిక విద్య నేర్చుకుంటున్నప్పుడు ఎలిమెంటరీ స్కూల్ నుంచి హైస్కూల్‌కి, హైస్కూల్ నుంచి కాలేజీకి, కాలేజీ నుంచి యూనివర్సిటీకి ఎలా ప్రమోషన్ వస్తూ ఉంటుందో ఇది కూడా అంతే.

ముందు ఆత్మే భగవంతుడు అని తెలుసుకున్నారు, మరి ఆత్మ ఎక్కడ ఉంటుందంటే? సర్వ జీవులలోనూ, సృష్టి అంతా ఉంటుందని తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆ ఆత్మ అనే భగవంతుడిని ఎలా చేరుకోగలరు అంటే? "శ్వాస మీద ధ్యాస" పెట్టి అంతర్ముఖమైతేనే తెలుసుకోగలరు అన్నది నేర్చుకున్నారు. అంతర్ముఖం అవుతున్నప్పుడు అడ్డు ఏమిటంటే? మనసు.

ఇప్పుడు చూడండి తమోగుణం, రజోగుణంలో ఉన్నప్పుడు ఎక్కువ ఆలోచనలు వస్తూ ఉంటాయి. ఎందుకు వస్తున్నాయి అంటే? తమోగుణం రజోగుణంలో మనసుకి చంచలత్వం ఎక్కువ ఉంటుంది. అంటే బాహ్య విషయాల మీద ఎంతగా ఆసక్తి ఉంటుందో ధ్యానంలో మనసు అంతగా ఇబ్బంది పెడుతుంది. బాహ్య విషయాల మీద ఆసక్తి తగ్గించుకోవాలి అంటే ఒక విషయం విన్నప్పుడు కానీ, చూస్తున్నప్పుడు కానీ, మాట్లాడుతున్నప్పుడు కానీ అక్కడితో అది వదిలేయగలిగితే ధ్యానంలో ఇబ్బంది పెట్టదు.

కానీ ఏం చేస్తున్నారు? ఒక విషయాన్ని చూసినా, అన్నా, విన్నా దాన్ని పదే పదే తెలిసున్న వాళ్ళందరికి చెప్పున్నాం. అంటే ఎన్ని సార్లు దాని గురించి మాట్లాడతామో మనకి అంత మననమైపోతుంది. అది ధ్యానంలో కూర్చున్నప్పుడు మనం భగవంతుడి వైపుకి ధ్యాస తిప్పుతున్నప్పుడు అది మనకి ఇబ్బంది అవుతుంది.

అందుకే కృష్ణ భగవానుడు చెప్తాడు. చైతన్యహీనమైన మనసు ఈ పరా ప్రకృతి వల్ల అంటే ఈ భగవంతుడి శక్తి వలన చైతన్యవంతమై నన్ను అడ్డుతుందా? అని నీకు నువ్వుగా ధ్యాన సమయంలో తెలుసుకోగలిగితే, దానికి ప్రాముఖ్యత నివ్వకుండా నీ సాధన నువ్వు కొనసాగించగలవు. భగవంతుడు శక్తిమంతుడా? మనసు శక్తివంతమైందా? అని సాధకుడు ఆలోచించగలిగితే!

ఈ భగవంతుని వల్లే శక్తి పొందిన మనసు ఇబ్బంది పెట్టినా నా ప్రయత్నంలో లోటు లేకుండా నేను సాధన చేస్తాను అని నువ్వు అనుకోగలగాలి.

అప్పుడు సాధకుడు మనసు ఎంత ఇబ్బంది పెట్టినా తన దృష్టిని ముందుకే పోనిస్తాడు కానీ, ఆ ఇబ్బందిని గమనించి అక్కడితో ఆగిపోడు. ఇప్పుడు గమనించండి మనం పరా ప్రకృతిని ఆరాధించాలా? అపరా ప్రకృతిని ఆరాధించాలా? ఈ విషయం తెలుసున్న సాధకుడు దేన్ని ఆరాధన చేయాలో తెలుసుకోగలుగుతాడు అని గీతలో కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది.

మరి ఈ విధంగా మనం ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాం. ఇంకా మనం వెనక్కి వెళ్తున్నాము అంటే మనకి సరైన అవగాహన లేదు అని మనము అర్థం చేసుకోగలగాలి. అందుకే ఇవన్నీ మనకి ఎందుకు తెలియబడుతున్నాయి అంటే? భగవంతుడు ఎవరో మనం తెలుసుకున్నా స్పష్టత లేదు. ఆ స్పష్టత కోసమే ఇంకా ఇంకా జ్ఞానం పెంచుకుంటున్నాం.

జ్ఞానం వచ్చింది అనుకుంటాం. ఆత్మ అంటే ఎవరో తెలిసింది, ఆత్మ ఎక్కడ ఉంటుందో తెలిసింది కానీ ఆత్మని దర్శించనంతవరకు మనకి పూర్ణ జ్ఞానం వచ్చినట్లు కాదు. ఆత్మను దర్శిస్తున్నాము అంటే పూర్ణ జ్ఞానం వచ్చినట్లే. మరి పూర్ణజ్ఞానం వచ్చినట్టే అని ఎలా తెలుస్తుంది అంటే? అందరికి నువ్వు శరీరం కాదు అని చెప్తున్నాం, ఆత్మగా చూస్తున్నాం కానీ ఇంకా నేను అనే భావన పోనంతవరకు జ్ఞానం రానట్టే.

వీడు శత్రువు, వాడు మిత్రుడు అని  మనసులో ఒక భావాన్ని ఏర్పరచుకున్నారంటే  ఇంకా ఆత్మ స్థితికి రాలేదు. ఆత్మ స్థితికి ఎదగడానికే ఇన్ని విషయాలు తెలుసుకోవాలి. అందు చేత తెలుసుకున్నది తక్కువ, తెలుసుకోవాల్సింది ఎంతో ఎక్కువ ఉంది.

పరా ప్రకృతిని ఆశ్రయించినవాడు అంటే భగవంతుడిని ఆశ్రయించిన వాడు శక్తివంతుడు అవుతాడు. అపరా ప్రకృతిని ఆశ్రయించినవాడు శక్తిహీనుడు అవుతాడు అని స్పష్టంగా చెప్పడం జరిగింది. మోక్షం పొందడానికి ధ్యానం తప్పించి  రెండో మార్గమే లేదు అని భగవద్గీతలో కానీ, ఉత్తరగీత కానీ

స్పష్టంగా చెప్పినా అపరా ప్రకృతిని అంటే దేవీ దేవతల్ని, ఈ పంచభూతాల్ని ఆశ్రయించడం వల్ల అది పుణ్య కర్మే అవుతుంది, కొద్దిపాటి ఫలితం వస్తుంది కానీ జనన మరణ చక్రంలో పడి, సంసారంలో పడి మళ్లీ మోక్షం కోసం కొట్టుకుంటూ ఉంటాడట. పరాప్రకృతిని ఆశ్రయించినవాడు అంటే భగవంతుడిని ఆశ్రయించినవాడు మోక్షాన్ని పొందుతాడు.

ఇదంతా భగవంతుడి సృష్టి. ఆయన ప్రకృతిని పరికరంలా వాడుకుంటున్నాడు. తాను తనలోనుంచి ఉద్భవించిన ఈ ప్రకృతితో ఈ సృష్టిని చేసి తనకి ఇష్టం వచ్చినన్నాళ్ళు నడిపిస్తాడు. తనకి ఇష్టమైపోయాక లయం చేస్తాడు. మళ్ళీ కొత్త సృష్టిని ప్రారంభిస్తాడు. అందుకే పరా, అపరా ప్రకృతులు రెండూ సృష్టికి ఉండాలి.

కానీ మానవుడు వివేకంతో, విచారణతో, విజ్ఞానంతో దేన్ని ఆరాధించాలో తెలుసుకోవాలి. అందుకే రెండుగా విభజించాడు జ్ఞానము, అజ్ఞానము అని. ధ్యానంలోకి వచ్చేవరకు అజ్ఞాన దశ. అంటే అక్కడ అన్నీ తెలిసిపోయాయి అనుకుంటారు కానీ, ఏమి తెలియని దశ. ధ్యానంలోకి వచ్చాక జ్ఞాన దశ.

అందుకే అజ్ఞానంలో ఉన్నవాడు ఒప్పుకోడు. భగవంతుడి గురించి సరైన అవగాహన లేనంతసేపు అది అజ్ఞాన దశే. భగవంతుడు ఎవరో తెలుసుకున్న దగ్గరనుంచే జ్ఞానం వస్తూ ఉంటుంది, అక్కడి నుంచి స్పష్టత వస్తుంది. మనకి ఇప్పుడు ఆత్మే భగవంతుడు అని స్పష్టంగా తెలుసు కానీ ఇంకా అనుభూతి పొందలేదు.

ఎందుకు పొందలేదంటే? ముక్తోపనిషత్తులో రాముడు చెప్పినట్టు ఇంకా పాత వాసనలు, పాత సంస్కారాలు మనకి వదలక ఇబ్బంది పెడుతున్నాయి. అందుకనే మనకి స్పష్టంగా తెలిసినా అనుభూతి కలిగే వరకు గురువు ఇచ్చిన సాధన మనం చేయాలి. బాహ్య విషయాల మీద ఆసక్తి తగ్గించి అంతరంలోకి ప్రయాణం ఎక్కువ చేయాలి.

భగవంతుడు అంటే ఎవరో మనకు స్పష్టంగా తెలుసు కాబట్టి ఎన్ని

ప్రలోభాలు మన చుట్టూ ఉన్నా ప్రలోభాలకి లొంగకుండా ఆత్మను దర్శించడానికే ప్రయత్నించాలి. అదే అవగాహన చేసుకోవాలి, దానికోసమే ఈ ప్రయత్నం.

అందుకే పర అపరా ప్రకృతుల యొక్క కలయికే ఈ సృష్టి. **"అపరా ప్రకృతిని ఆరాధిస్తే జన్మలు వస్తాయి, పరా ప్రకృతిని ఆరాధిస్తే మోక్షం వస్తుంది".** అపరా ప్రకృతిని ఆశ్రయిస్తే శక్తిని కోల్పోతాము, పరా ప్రకృతి ఆశ్రయిస్తే శక్తివంతులం అవుతాము.

ఈ ఆత్మ వల్లే, ఈ పరమాత్మ వల్లే ఈ సృష్టి అంతా కూడా చైతన్యవంతం అవుతోంది. ఆ పరమాత్మ తప్పుకోగానే ఇవన్నీ జడమవుతాయి అని పదే పదే గుర్తుచేసుకోవాలి. అప్పుడు ఎన్ని ప్రలోభాలు ఉన్నా ఆత్మను దర్శించడానికే ప్రయత్నిస్తారు.

అప్పుడు పరమాత్మ మీద ప్రీతి, బాహ్యం మీద ఉదాసీనత ఏర్పడుతుంది. అప్పుడు దేన్నీ తిట్టరు, చూస్తూ ఊరుకుంటారు, అది అంతే అలాగే ఉంది! సృష్టిలో ఏది చెడ్డది కాదు అన్నది అర్థమైనప్పుడు దేన్నీ విమర్శించకుండా, సాక్షిగా గమనిస్తూ, మీ పని మీరు చేసుకుంటారు. ఆత్మానుభూతి కోసం మీ సాధన చేస్తూ మీ మీద మీ దృష్టి పెట్టుకుంటూ ముందుకి ఎదుగుతారు.




**పత్రీ గారి పుస్తకములు**

| | | |
|---|---|---|
| **1) జ్ఞానరసగుళికలు (పత్రీజీ)** | **-** | **రూ.160/-** |
| **2) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ)** | **-** | **రూ.160/-** |
| **3) యోగుల సందేశాలు** | **-** | **రూ.160/-** |
| **4) జ్ఞాన సందేశాలు** | **-** | **రూ.160/-** |
| **5) పత్రీజీ సందేశాలు** | **-** | **రూ.160/-** |
| **6) విజ్ఞానసారం** | **-** | **రూ.160/-** |
| **7) పరమయోగి కబీరు సందేశాలు** | **-** | **రూ.70/-** |
| **8) ధ్యానం (పత్రీజీ)** | **-** | **రూ.60/-** |

# బుద్ధి లక్షణాలు?

ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చిన ప్రతి వారిలోనూ బుద్ధే ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. అందుకే రాఘవరావు గారు బుద్ధిని వికసింప చేసుకోండి అనే మాట ఎక్కువ చెప్తూ ఉంటారు. అంటే ఇంద్రియాలన్నీ మనసు ఆధీనంలో ఉంటే, మనసు బుద్ధిని బట్టి ఉంటుంది. అంటే బుద్ధి నిర్ణయాన్ని బట్టి మనసు చేసే పనులు ఆధారపడి ఉంటాయి. కాబట్టి బుద్ధిని వికసింప చేసుకునే వారికి జ్ఞానం కూడా  ఉంటుంది.

జ్ఞానాన్ని గురువుల ద్వారా, సజ్జన సాంగత్యాల ద్వారా, స్వాధ్యాయం ద్వారా సేకరిస్తూ ఉంటుంది బుద్ధి. ఈ జ్ఞానం అంతా కూడా సేకరించేది బుద్ధి, నిర్ణయించేది కూడా బుద్ధే. అందుకే మన జీవితంలో మన నిర్ణయాలు సరిగ్గా ఉంటే బుద్ధి సరిగ్గా ఉన్నట్టు. నిర్ణయాలు సరిగ్గా లేకపోతే బుద్ధి సరిగ్గా లేనట్టు. ఈ బుద్ధినే మహాత్ములు 1)చంచల బుద్ధి, 2) నిశ్చల బుద్ధి అని రెండు రకాలుగా విభజించడం జరిగింది.

**1) చంచల బుద్ధి:-**

ఈ చంచల బుద్ధి ఉన్నవాళ్ళు ఎట్లా ఉంటారు? ఏ ఏ పనులు చేస్తూ ఉంటారు? ఏ ఏ కోరికలతో ఉంటారు? అనేది తెలుసుకుందాం.

చంచల బుద్ధి ఉన్న వాళ్ళు రజోగుణంలో ఉంటారు అని ఖచ్చితంగా చెప్పవచ్చు. రజోగుణంలో ఉన్న వాళ్ళు కర్మలు ఎక్కువగా చేస్తారు, అది పాపమైనా, పుణ్యమైనా కర్మల మీద ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. అలాగే ఈ చంచల బుద్ధి ఉన్నవాళ్ళకి ఇంద్రియ నిగ్రహం ఉండదు, విషయాసక్తి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆ ఆసక్తి వల్ల దేని మీదా స్థిరమైన నిర్ణయం వీళ్ళకి ఉండదు.

అందుకే ఎప్పుడూ కర్మలు చేస్తూనే ఉంటారు. మరి ఇటువంటి వాళ్ళు ఏదైనా నిర్ణయించుకుని, ఆ పని చేస్తారు. ఎవరైనా మళ్లీ ఇంకో రకం చేస్తే మళ్ళీ దాని గురించి ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇది చంచల బుద్ధి  యొక్క

లక్షణం. వీళ్ళకి ఇంద్రియ నిగ్రహం లేక విన్నది, చూసింది ప్రతిదీ కూడా కావాలి అనిపిస్తుంది. ఆ కావాలి అనే కోరిక ఎప్పుడైతే మొదలైందో అప్పటినుంచి దానికోసం ప్రయత్నం చేస్తూ, కర్మలు చేస్తారు.

ఇంద్రియ నిగ్రహం ఉన్నవారు తక్కువ కర్మలు చేస్తారు. ఇంద్రియ నిగ్రహం లేనివారు కర్మలు ఎక్కువ చేస్తారు. వీరికి ఇహలోక సుఖాల మీదే కాదు, స్వర్గాది భోగాల మీద కూడా ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ప్రపంచంలో చూస్తే ప్రతివాళ్ళు సుఖం అనుభవించాలి అని పరుగులు పెడతారు. మరి సుఖం కావాలి అంటే ధనం కావాలి, ధనం కావాలి అంటే దానికోసం ప్రయత్నం చేయాలి. ఉన్నదానితో తృప్తి పడినవాడికి ఎక్కువ ప్రయత్నం అక్కర్లేదు. కాని ఎక్కువ ఆశపడిన వాడు ఎక్కువ కర్మలు చేయాల్సి వస్తుంది.

ఎందుకంటే వీరిని గమనిస్తే లోక వాసన, దేహ వాసన, శాస్త్ర వాసన ఈ మూడు వాసనలు ఎక్కువగా ఉంటాయి.

1) లోక వాసన అంటే లోకం అందరూ మెచ్చుకోవాలి, గొప్పవాడు అనుకోవాలి అని అనుకోవడమే లోకవాసన. నేను ఆనందంగా, సంతోషంగా, సుఖంగా ఉండాలి అనుకుంటారు. ఈ భూమిమీద పొందే ఆనందాలు, సుఖాలు, భోగాలు కూడా తాత్కాలికమే! కానీ అది ఎంత చెప్పినా వీళ్ళకి రజోగుణం వల్ల అర్థం కాదు.

2) దేహవాసన అంటే దేహం అందంగా ఉంచుకోవాలి, దేహాన్ని సుఖంగా ఉంచుకోవాలి, దేహాన్ని సంతోష పెట్టాలి ఇన్ని కోరికలు ఉన్న మానవుడు మరి దానికోసం ప్రయత్నాలు చేయాలిగా! దానికోసం కర్మలు చెయ్యాలిగా! ఈ కోరికలనేవి ఒకదాని తర్వాత ఒకటి పుడుతూనే ఉంటాయి. దేహాన్ని సుఖపెట్టడం మొదలు పెట్టాక ఒక సుఖం వెనకాల ఇంకొక సుఖం కావాలనిపిస్తుంది.

ఇల్లే లేని వాడు ఒక చిన్న ఇల్లు చాలనుకుంటాడు. చిన్న ఇల్లే కదా అని మొదలు పెడతాడు. ఏదో ఒక రకంగా ఇల్లు పూర్తి చేస్తాడు. దానితో

అయిపోతుందా? ఇంట్లోకి ఫర్నిచర్ కావాలి, ఇంటికి కావలసినవన్నీ అమర్చుకుంటూ ఉంటాడు, తర్వాత ఒక కారు కొనుక్కోవాలి మరి అలా అలా ఒకదాని వెనక ఒకటి కోరుకుంటాడు. ఈ మాత్రం సుఖపడకపోతే ఎలాగా? ఈ మాత్రం అమర్చుకోకపోతే ఎలాగా? అంటూ ఉంటాడు. అంటే ఒకటి కోరుకుని 10 రకాలు అమర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారంటే బుద్ధి ఎంత చంచలంగా ఉందో ఆలోచించవచ్చు!

3) శాస్త్రవాసన అంటే ఆధ్యాత్మికత అన్నది వీళ్ళకి తెలియనే తెలియదు. అందుకే వీళ్ళు పూజ చేస్తే ఈ లాభం, ఈ నోము చేస్తే ఈ లాభం అని చేస్తారు. కర్మలని పెంచే పుస్తకాలు కొన్ని ఉంటాయి ఆ పుస్తకాలను బాగా చదువుతారు. నాకు తెలిసిన వాళ్ళు చాలామంది బోళ్ళన్ని నోములు నోచేస్తారు. ఇవన్నీ ఎక్కడివర్రా అంటే? ఆ పుస్తకాలు వచ్చాయి కదా ఫలానా నోముకి ఈ పుణ్యం ఉంది, దీనికి ఈ పుణ్యం అనుకుంటూ స్వర్గ సౌఖ్యాల కోసం పుస్తకాలు చదువుతూ అలా చేయడానికి ప్రయత్నిస్తారు కానీ మోక్షం కోసం ప్రయత్నించరు.

పూజిస్తున్న దేవుళ్ళనైనా ఒక్క దేవుడినే పట్టుకుంటారా అంటే! సోమవారం శివుడి గుడికి, మంగళవారం ఆంజనేయ స్వామి గుడికి, బుధవారం సంతోషిమాత గుడికి, గురువారం సాయిబాబా గుడికి, శుక్రవారం అమ్మవారి గుడికి, శనివారం వెంకటేశ్వర స్వామి గుడికి, ఆదివారం సూర్య భగవానుడికి. ఏడు రోజులు ఏడుగురిని ఆరాధిస్తూ మాకు ఎంతో పుణ్యం వస్తుందనే భ్రాంతిలో వుంటారు.

ఎప్పుడైనా వీళ్ళు అనుకున్నది జరగనప్పుడు నేను ఇన్ని ఆరాధనలు చేస్తున్నాను కానీ నా జీవితంలో కష్టాలు మాత్రం పోవట్లేదు అని మళ్లీ అక్కడ నిరుత్సాహం. మరి ఇన్ని రకాల ఆరాధనలు చేస్తున్నారంటే చంచల బుద్ధే కారణం, ఆ రజోగుణమే కారణం. ఈ వాసనలు తగ్గేదాక అలా చేస్తూనే ఉంటారు, పరిగెడుతూనే ఉంటారు, మారుస్తూనే ఉంటారు.

వీళ్ళకి ధనం మీద ప్రేమ, భార్య భర్తల మీద ప్రేమ, పుత్రుల మీద

ప్రేమ, బంధువుల మీద ప్రేమ. ఇవన్నీ బంధాలవుతాయి. కోరుకున్నవన్నీ దొరికినప్పుడు జీవితం అమృతంలా ఉంటుంది. కాని కష్టాలు వచ్చినప్పుడు దుఃఖం ఉంటుంది. మళ్ళీ ఎందుకురా బాబు నాకు ఇవి! ఈ ధనం వల్లా సుఖం లేదు, పిల్లల వల్లా సుఖం లేదు, శరీరం కోసం ఇంత పాటు పడ్డాను. ఈ శరీరం రోగగ్రస్తమైతే ఇంట్లో వాళ్ళే విసుక్కుంటున్నారు. ఇవన్నీ నేను అనవసరంగా చేశాను అనుకుంటారు.

ఒకప్పుడు కావాలనుకునే బుద్ధి ఇప్పుడు అవన్నీ అవసరం లేదు అనిపిస్తుంది. అంటే ఈ బుద్ధి ఎంత మారిందో చూడండి. అలా మలిన వాసనల పట్టుకుంటారు. ఎందుకు ఈ దేహ వాసన, శాస్త్ర వాసన, లోక వాసనల్ని మలిన వాసనలు అని అన్నారంటే? ఏ వాసనలు పరమాత్మని చేర్చవో అవన్నీ మలిన వాసనలే. ఏ వాసనలైతే నిన్ను పరమాత్మ దగ్గరికి చేరుస్తాయో అవే శుద్ధ వాసనలు అని ముక్తోపనిషత్తులో శ్రీరాముడు ఆంజనేయ స్వామికి బోధించిన బోధలో ఉంది.

మలిన వాసనలు, శుద్ధ వాసనలు అని రెండు రకాల వాసనలు ఉన్నాయి. మలిన వాసనలు ప్రపంచం వైపుకు తీసుకువెళ్తాయి, శుద్ధ వాసనలు పరమాత్మ వైపుకు తీసుకువెళ్తాయి. మరి శుద్ధ వాసనలు మోక్షానికి తీసుకువెళ్తాయి, మలిన వాసనలు  జనన మరణ చక్రంలో పడవేస్తాయి.

అందుకే ఏ భ్రాంతులు ఉంటే మలిన వాసనలు? ఏ భ్రాంతి ఉంటే శుద్ధ వాసన? గ్రహించడానికే పత్రిగారు స్వాధ్యాయం చేయమని బోధించారు. ఆయనే కాదు వశిష్టుల వారు కూడా రాముల వారికి  స్వాధ్యాయం మీద ఎంతో చక్కగా బోధ చేశారు.

మరి ఈ వాసనలు వదలగొట్టుకోవాలి. అంటే లోకం ఏమనుకుంటుందో అని, శరీరాన్ని సుఖపెట్టాలనే ఆలోచనలు మానుకోవాలి. శాస్త్రాల్లో  ఈ పూజ చేస్తే ఈ పుణ్యం వస్తుంది, స్వర్గం ప్రాప్తిస్తుందని చెప్తే చేస్తున్నారు, మరి స్వర్గంమేనా ఉన్నది? దాని తర్వాత లోకాలు లేవా? అంటే

ఇంకా నాలుగు లోకాలు ఉన్నాయి. కానీ స్వర్గంలో ఉండడానికి కావలసినవే అందరూ చేస్తున్నారని, ఎవరో చెప్పారని చేస్తున్నారు.

ఇవన్నీ చేస్తున్నారు అంటే బుద్ధి ఇంకా చంచలావస్థలో ఉన్నట్టే, రజోగుణంలో గుణంలో ఉన్నట్టే అని అర్థమవ్వాలి. రజోగుణం వదలనంతసేపు బుద్ధి చంచలావస్థలోనే ఉంటుంది.

అలాగే విషయాల పట్ల ఆసక్తి ఉన్నా చంచలంగా ఉన్నట్టే. అంటే నా గురించి ఏమనుకుంటున్నారు? నన్ను పొగుడుతున్నారా? నేను ఇంత మంచి పని చేస్తున్నాను, ఇంత గొప్పగా చేస్తున్నాను అనుకుంటారు. ఆఖరికి దానధర్మాలు చేసినప్పుడు కూడా వీళ్ళందరూ నన్ను పొగుడుతున్నారా? లేదా? అని ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ఈ ఆసక్తి ఉన్నా బుద్ధి చంచలంగా ఉన్నట్టే.

"పరులు ఎరుగకున్నా, పరమాత్మ ఎరుగడా!" అంటారు. పరులు తెలుసుకోవాల్సింది ఏముంది? పరమాత్మకు తెలిస్తే చాలు కదా! అనేది సాత్విక గుణ లక్షణం. అందుకే పూర్వం అన్ని దానాల కంటే గుప్తదానం మిన్నా అని చెప్పేవారు. నీకు, పరమాత్మకి తెలియాలి కానీ ప్రజలకు తెలియవలసిన అవసరం లేదు. కానీ అందరూ పొగడాలి అనుకుంటే ఇంకా చంచల బుద్ధే.

పొగిడే వాళ్ళు ఎంతమంది ఉంటారో గమనించుకుంటే విమర్శించే వాళ్ళు దానికి రెట్టింపు మంది ఉంటారు. ఎప్పుడూ కూడా ప్రపంచమంతా పొగిడేస్తుందని అనుకోనక్కర్లేదు. బుద్ధుడు లాంటి త్యాగ పురుషుడినే విమర్శించారు. మనలాంటి వాళ్ళని విమర్శించరా? విమర్శ వచ్చింది అంటే వాళ్ళకి ఈర్ష్య వచ్చింది అని గ్రహించాలి.

మీరైనా సరే విమర్శిస్తున్నారు అంటే ఎక్కడో ఈర్ష్య ఉన్నట్టే. అందుకే పత్రిగారు "నో కామెంట్, నో జడ్జిమెంట్" అని చెప్పేవారు. ఎందుకంటే ఊరికే మొదలు పెట్టినా విమర్శ, తర్వాత చిలికి చిలికి గాలి వానలా తయారైపోతుంది, అందుకే ఏమీ అనొద్దు, వాడి కర్మ వాడు అనుభవిస్తాడు అంటారు.

ఒకసారి మార్చడానికి ప్రయత్నం చేస్తాం, ఇంక వాడు మారడు అని తెలిసినప్పుడు మన అభిప్రాయాన్ని మార్చుకోవడమే. అందుకే ఎప్పుడూ

కూడా నేను ఎంత ఎదిగాను? నా బుద్ధి ఎలా ఉంది? నేను చంచల బుద్ధిలో ఉన్నానా? నిశ్చల బుద్ధికి వస్తున్నానా? అని గమనించుకోవాలి.

తమోగుణంలో ఉంటే మంచి కర్మలు చేయరు, కర్తవ్య కర్మలు కూడా మానేస్తారు. రజోగుణంలో ఉంటే మిశ్రమ కర్మలు అంటే పాపకర్మలు, పుణ్యకర్మలు రెండూ చేస్తారు.

పాపాలు, పుణ్యాలు ఎందుకు చేస్తున్నారు? అంటే దానికి మలిన వాసనలే కారణం. అంటే డబ్బు ఉంటే సుఖపడతామని, పదవులు ఉంటే గొప్ప పేరు వస్తుందని, నా శరీరాన్ని సుఖపెట్టాలని అనుకుంటూ కొన్ని కర్మలు చేస్తే, స్వర్గలోక ప్రాప్తి వస్తుందని కొన్ని పుణ్య కర్మలు చేస్తున్నారు. ఈ రెండు కూడా అశుద్ధ వాసనలే. కానీ పరమాత్మ కోసం చేసే ప్రయత్నమే శుద్ధ వాసన.

ఇవన్నీ శాస్త్రాల ద్వారా తెలుస్తాయి. ఈ సాధనా మార్గంలోకి వచ్చినప్పుడు చదవవలసినవి జనన మరణ చక్రంలో పడవేసే పుస్తకాలు కాదు. సత్యలోకానికి చేరడానికి ఎటువంటి సాధన చేయాలి? ఎటువంటి జ్ఞానం పొందాలి? అనేటటువంటి ఆత్మ సంబంధమైన పుస్తకాలు ఎక్కువ చదవాలి.

ఏ సాధన అయితే మిమ్మల్ని ఉన్నత స్థితికి తీసుకువెళ్తుందో! రాగద్వేషాలకు దూరంగా ఉంచుతుందో! ఆ సాధనని పెంచే పుస్తకాలు చదవాలి. అందుకే ఈ పిండాండాన్ని తెలుసుకుంటే బ్రహ్మాండం తెలుస్తుంది అని మహాత్ములు చెప్పారు. అంటే నీ ఆత్మను తెలుసుకుంటే పరమాత్మని తెలుసుకోగలవు అని చెప్పారు. కానీ చంచల బుద్ధి ఉన్నవాడికి ఎప్పుడూ కూడా మోక్షకాంక్ష ఉండదట.

ధ్యానం ఎంత చెపుతున్నా కొంతమందికి ఎక్కదు. కారణం వాడు ఆ స్థితికి రాలేదు కాబట్టి. సత్వగుణమే సత్యానికి వెళ్లే మార్గం అని చెప్పారు. సత్వగుణంలో ఉన్నవాడికే సత్యాన్ని తెలుసుకోవాలనే కాంక్ష ఉంటుంది, మోక్షం పొందాలనే కాంక్ష ఉంటుంది, రజోగుణంలో ఉన్నప్పుడు ఉండదు.

ఒక భోగికి మరణం అంటేనే భయం ఉంటుంది, కాని ఒక యోగికి మరణం అంటే ఒక ఆట. ఎందుకంటే కొత్త చీర కట్టుకోవడానికి  ఎంత ఆనంద పడుతూ ఉంటారో అలాగే కొత్త శరీరాన్ని ధరించి ఇంకా బాగా సాధన చేస్తూ, ఇంకా జ్ఞానాన్ని పెంచుకోవాలి అనే ఆసక్తి యోగిలో ఉంటుంది కానీ మరణం అంటే భయమే ఉండదు.

ఈ చంచల బుద్ధి ఉన్నవాళ్ళు నిలకడగా ఒక నిర్ణయం ఎప్పుడూ తీసుకోరు. ఎప్పుడైనా ఒక నిర్ణయం తీసుకుని ఆ పని చేస్తున్నప్పుడే మొదలెడతారు అయ్యో! ఇలా మొదలుపెట్టానే అలా మొదలపెడితే ఇంకా బాగుండునేమో అని వెంటనే అనుకుంటారు. అంటే ఈ చంచల బుద్ధి వల్ల కాసేపు దీని మీదా, కాసేపు దాని మీదా ఉంటుంది.

అందుకే కొంతమంది చూడండి సాధన మొదలుపెట్టి కొన్నాళ్ళ చేసి ఏ ఫలితం రాలేదని ఇక్కడ ఎవరో తలపైన చేయ పెడితే ఎనర్జీ బాగా పాస్ అయిపోతుందంట, లేకపోతే ఇంకో రకం ధ్యానం చేస్తే కుండలిని శక్తి సహస్రారంలోకి ఒక్కసారే వెళ్ళిపోతుందట అది ప్రయత్నిద్దాం అనుకుంటారు. ఎవరైనా సరే చేస్తున్న పనిని అసంపూర్తిగా వదిలి ప్రక్కన ఇంకొకటి మొదలు పెట్టారు అంటే వారిది ఖచ్చితంగా చంచల బుద్ధే.

ఇప్పుడు నువ్వు ఏదైనా పని మొదలు పెట్టావంటే దాన్ని పూర్తి చేయాలి, దాని ఫలితం ఎంత వస్తుందో చూడాలి. పని పూర్తి అవ్వకుండా ఫలితం నీకు ఎప్పుడూ రాదు. అందుకే నువ్వు "శ్వాస మీద ధ్యాస" పెట్టి  ప్రయత్నించినప్పుడు ఫలితాలు అద్భుతంగా ఉంటాయి.  త్రికరణ శుద్ధిగా నమ్మితే సహకారం లభిస్తుంది.

అందుకే సాధన చేసి అత్యున్నత స్థితికి వెళ్ళినవాళ్ళు కూడా ఉన్నారు. పత్రిగారు" శ్వాస మీద ధ్యాస" పెట్టి ఇన్ని లక్షల మందికి, కోట్ల మందికి జ్ఞానం చెప్పగలిగి నప్పుడు ఆ "శ్వాస మీద ధ్యాస" పెడితే మీరైనా ఆ స్థితికి ఎందుకు ఎదగలేరు? అంటే చంచల బుద్దే కారణం.

పోనీ  రకరకాల ధ్యానాలు చెప్పే వాళ్ళు పత్రీగారంత ఫేమస్ అయ్యారా? పత్రీగారికి ఉన్నంతమంది శిష్యులు ఉన్నారా? మరి ఆయనంత జ్ఞానం చెప్పగలుగుతున్నారా? అని ఒక్కసారి ఆలోచిస్తున్నారా? అంటే చంచల బుద్ధి ఉన్నప్పుడు సత్యం గురించి ఆలోచించే శక్తి కూడా వాళ్ళకి ఉండదు. ఆ సత్యం గురించి ఆలోచించాలి అంటే నిశ్చల బుద్ధి ఉండాలి, సాత్వికంలోకి రావాలి.

చంచల బుద్ధి ఉన్నన్నాళ్ళు ఎప్పుడూ స్థిరత్వం లేని జీవితమే ఉంటుంది. కోరుకుంటారు కోరుకున్నది వచ్చినా తృప్తి లేని జీవితమే. అందుకే ఇంద్రియ నిగ్రహం లేని వాడికి మరి అహంకారం పెరిగిన వాడికి, లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన వదలని వాడికి, ఇవన్నీ ఇలాగే ఉంటాయి. సంసారము, భార్య, పిల్లలు రానంతసేపు వారు ఉంటే బాగుండును అనిపిస్తుంది. వచ్చాక వాటి వల్ల కష్టాలు ఉన్నప్పుడు అయ్యో ఇదివరకు జీవితమే బాగుంది, పెళ్లి అయ్యాకే దరిద్రం పట్టుకుంది అని అనుకుంటారు.

మరి ఈ దరిద్రం కోసమే కదా తపించావు.  దరిద్రం కావాలని కోరుకుని మళ్లీ దరిద్రం దరిద్రం అనుకోవడం ఎందుకు అంటే? చంచల బుద్ధే దానికి కారణం. అప్పుడు ఆ జీవితం నచ్చలేదు, ఇప్పుడు ఈ జీవితం నచ్చట్లేదు. అంటే బుద్ధి చంచలమైనప్పుడు వాళ్లకి ఏ రకమైన జీవితం నచ్చదు. రజోగుణం అంటేనే చంచల బుద్ధి.

చంచల బుద్ధి ఉన్నవాడు సరైన నిర్ణయం తీసుకోలేడు, సరైన జీవితం జీవించలేడు, సరైన సుఖం పొందలేడు, సరైన సంతోషం పొందలేడు. వాడి జీవితంలో అన్నీ తాత్కాలికంగా ఉంటాయి కానీ ఏది శాశ్వతంగా ఉండదు. వీళ్ళకు చచ్చేవరకు ప్రపంచ భ్రాంతి పోదు. ఈ చంచలం బుద్ధి పోవాలి అంటే రజోగుణం నుంచి సాత్విక గుణంలోకి రావాలి.

కనుక  ఎక్కడైనా స్థిరత్వం లేని నిర్ణయాలు తీసుకున్నా, పదే పదే ప్రాపంచికం మీదకి వెళ్ళిపోతున్నా, పదే పదే శరీరం గురించి ఆలోచిస్తున్నా,

పదే పదే బంధాల గురించి ఆలోచిస్తున్నా ఇంకా చెంచల బుద్ధి ఉన్నట్టే అని తెలుసుకోవాలి. ఊగే ఉయ్యాల్లో పసిబిడ్డను పడుకోబెట్టలేరు, కదిలే నీళ్ళలో రూపాయి నాణం వేసినా స్పష్టంగా కనిపించదు. ఆ నీళ్ళు నిశ్చలంగా ఉన్నప్పుడే కనిపిస్తుంది.

అలాగే బుద్ధి నిశ్చలమైనప్పుడే జీవితంలో సుఖ సంతోషాలు అనుభవించగలరు. అందుకే చంచల బుద్ధి నుంచి నిశ్చల బుద్ధిలోకి రావాలి. ఈ చంచలత్వం ఎప్పుడూ దుఃఖాన్ని తెస్తూనే ఉంటుంది అది మార్చుకోవాలి. ప్రతి ధ్యాని నా జీవితంలో నేను సాత్వికంలోకి వెళ్లి నిశ్చలంగా ఉన్నానా? లేదా? అని విచారణ చేసుకోవాలి.

**2) నిశ్చల బుద్ధి :-**

ఆధ్యాత్మిక జీవితంలో బుద్ధి చాలా ముఖ్య పాత్ర వహిస్తుంది. బుద్ధి ఎంతగా మనం వికసింప చేసుకుంటే, నిశ్చలంగా ఉంచుకోగలిగితే జ్ఞానం అంతగా పెరుగుతుంది. పరిమిత బుద్ధి ఉంటే కొన్ని విషయాలు మాత్రమే గ్రహించగలరు. ఇంకొంచెం బుద్ధి వికసించినప్పుడు ప్రాపంచిక విషయాలు మాత్రమే గ్రహించగలరు. ఇంకొంచెంగా వికసించినప్పుడు చదువుల్లో కానీ, కళల్లో కానీ ప్రావీణ్యం సంపాదిస్తారు.

ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చినప్పుడు ప్రాపంచిక జీవితం కంటే కూడా చాలా ఏకాగ్రతతో ఉండాలి. అప్పుడు బుద్ధికి జ్ఞానం ఎక్కుతుంది. అంత ఏకాగ్రత లేకపోతే మనము ఈ ఆధ్యాత్మిక విషయాలు ఎక్కించుకోలేరు. ఎప్పుడైతే మీ మేధస్సు అది అందించలేదో అప్పుడు అవి ఆచరణలో పెట్టుకోలేక, పాతవాసనలు వదలలేక, కొత్త సంస్కారాలు మీ జీవితంలోకి తెచ్చుకోలేరు.

వర్తమాన జీవితానికి కారణం పాత కర్మలే, పాత వాసనలే, పాత సంస్కారాలే. అవి వదలని వాళ్ళు మంచి ఏమిటో? చెడు ఏమిటో తెలియని వాళ్ళు చంచల బుద్ధిలో ఉంటారు. కానీ తమోగుణం, రజోగుణం వదిలి సాత్విక గుణం లోకి వచ్చినప్పుడు మాత్రమే మార్పులు జరుగుతాయి.

తమోగుణంలో కర్తవ్య కర్మలు చేయడానికి కూడా బద్ధకంగా వుండేవాడు కొన్ని జన్మలు అనుభవాలు పొందాక, రజోగుణంలోకి వచ్చాక, కర్తవ్య కర్మలతో పాటు... పాప కర్మలు, పుణ్య కర్మలు కూడా ఎక్కువ చేస్తూ ఉంటాడు. మరి కొన్ని జన్మలు అనుభవాలు పొందాక ఇలా ఉండడం వల్లే నేను ఇలా దుఃఖంలో ఉన్నాను అని తెలుసుకుని సాత్విక గుణంలోకి వస్తాడు. అలా ప్రతి జన్మలో గుణాన్ని మార్చుకుంటూ ఉంటాడు.

ఏ తప్పు వల్ల, ఏ తప్పుడు ఆలోచనల వల్ల వర్తమానంలో నాకు ఈ కర్మ ఫలితం వచ్చింది అనే ఒక పాఠం ప్రతి జన్మలోనీ నేర్చుకోవాలి. నా జీవితంలోకి వచ్చిన దుఃఖాలకి కారణం భగవంతుడే, నా నుదుటిన ఇలా రాసి పెట్టాడు అని అనుకుంటే అది అజ్ఞానం. సాత్విక గుణంలోకి వచ్చాక ఈ అజ్ఞానం జీవితంలో అస్సలు ఉండకూడదు.

ఇప్పుడు చూడండి ఎవరికైనా పిల్లలు కలగకపోతే ప్రక్క వాళ్ళు కూడా అడుగుతూ ఉంటారు పిల్లలు ఇంకా పుట్టలేదా? అని. ఆ ప్రశ్నే అజ్ఞానం. వాళ్ళ నిర్ణయం అలా ఉంది అందుకే వాళ్ళ జీవితంలో ఇలా జరుగుతుంది అని తెలుసుకుంటాడు. జ్ఞాని అందుకే అడగను కూడా అడగడు. ఒకవేళ అడిగినా అయ్యో ఇంకా పుట్టలేదా! అని రెండో మాట మాట్లాడడు. అంటే ఎదుటి వాళ్ళని బాధ పెట్టకుండా వుంటారు అంటే వాళ్ళు ఖచ్చితంగా సాత్విక గుణంలోకి వచ్చిన వాళ్ళు.

చాలామంది వాళ్ళ పనుల వల్ల కానీ, వాళ్ళ చేతల వల్ల కానీ, ప్రక్కవాడు బాధపడుతున్నాడు అని తెలుసుకోలేనంత మూర్ఖపు మనస్తత్వంతో ఉంటారు. అది రజోగుణమే. మరి సాత్విక గుణంలోకి వచ్చాక సత్యానికి చేరువయ్యే జీవుడు ముందు ఇవి వదులుకోవాలి. మరి భగవంతుడు కూడా పూజా విధానం చెప్పినప్పుడు అహింసా ప్రథమా పుష్పం అన్నాడు. ఎప్పుడు నువ్వు సాత్విక గుణంలోకి వెళ్ళగలవు? అంటే అహింసలో జీవించినప్పుడు మాత్రమే భగవంతుని చేరుకోగలిగే స్థితి వస్తుంది. ఆ భగవంతుడి మీదకి

దృష్టి మళ్ళుతుంది. నీకు ఏ క్షణాన భగవంతుడి మీద దృష్టి మళ్ళిందో ఆ క్షణంలోనే నువ్వు సాత్విక గుణంలోకి వచ్చినట్టు నీకు అర్థమవ్వాలి.

అయితే సాత్విక గుణంలో ఉన్నవాడు ఎట్లా ఉండాలి అంటే సృష్టిలో జీవిస్తూ దృష్టి భగవంతుడి మీద పెట్టగలగాలి. ఇది మనకి ఎంత కష్టమైన పని? ఎంత చిత్రమైన పరీక్ష! అంటే ఒక గుణం నుంచి ఇంకొక గుణంలోకి మారేటప్పుడు, భగవంతుడికి దగ్గర అవుతున్నప్పుడు మనకి ఇంకా పరీక్షలు ఉంటాయి. అందుకే కొంతమంది ధ్యానంలోకి గమ్మున రారు. పరీక్షలకు భయపడతారు.

ఎందుకు అంటే? ధ్యానంలోకి వచ్చిన వాళ్లని చూసి అమ్మో వాళ్ళు ఏం సుఖపడ్డారు? వాళ్ళకి అన్నీ కష్టాలే కదా! అంటారు. కానీ వీళ్ళు భగవంతుడికి ఎంత దగ్గర అవుతున్నారు అన్నది బాహ్యంల్లో ఉన్నవాళ్ళకి అర్థం కాదు. కానీ యోగికి అర్థమవుతుంది. నా చుట్టూ ఇన్ని పరీక్షలు ఉన్నాయంటే భగవంతుడికి నేనే నచ్చాను. నచ్చాను కాబట్టే ఆయనది దయగల మనసు కనుకే నన్ను ఇంకా ఇంకా దగ్గరికి తీసుకోవడానికే, ఈ కర్మలను పోగొట్టడానికే నాకు అన్నీ ఒకసారే ఇచ్చి నన్ను తన దగ్గరికి తీసుకుంటున్నాడు అని అర్థం చేసుకుంటాడు జ్ఞాని.

ఎప్పుడూ కూడా కష్టాలను దాటగలిగే శక్తి నీలో ఉన్నప్పుడే నీ చుట్టూ ఆ సమస్యలు, కష్టాలు వస్తాయి అని పత్రిగారు చెప్తూ ఉండేవారు. వాటిని దాటగలిగే సమర్థత నీలో ఉంది కాబట్టే ఆ పరమాత్మ ఇస్తున్నాడు. సమర్థులకే సవాళ్లు ఇవ్వబడతాయి. ఇవి మనకి తమోగుణంలో, రజోగుణంలో అర్థం కాదు. సాత్విక గుణంలోకి వచ్చాక అర్థమవుతుంది. సాత్వికంలో బుద్ధి నిశ్చలత్వంలోకి వస్తుంది.

ఎందుకు బుద్ధి సాత్వికంలో నిశ్చలత్వంలోకి వస్తుంది అంటే? భగవంతుడి మీద దృష్టి మరలడం వల్ల. సాత్విక గుణంలోకి వచ్చాక మలిన వాసనలు, దుష్ట వాసనలు పోయి శుద్ధ వాసనల్లో ఉంటాడు. అంటే వీళ్ళు ప్రపంచం మీద ఆసక్తి తగ్గించుకుని పరమాత్మ మీద ఆసక్తిని పెంచుకుంటారు.

ఎప్పుడైతే ప్రపంచం మీద ఆసక్తి తగ్గిపోయిందో అప్పుడు వీళ్ళ దృష్టి చంచలం నుంచి నిశ్చలంలోకి వస్తుంది.

ఇప్పుడు చూడండి మీకు మహాభారతంలో ఎవరిది చంచల బుద్ధి? ఎవరిది నిశ్చల బుద్ధి? అని పరీక్షించడానికి ద్రోణుడు ఒక చిన్న పరీక్ష పెడతాడు. ఏమిటంటే? నిశ్చల బుద్ధి ఉన్నవాడికి ఏకాగ్రత ఎక్కువ ఉంటుంది. చంచల బుద్ధి ఉన్నవాడికి ఏకాగ్రత చాలా తక్కువ ఉంటుంది. అందుకే పక్షి కనుగుడ్డును కొట్టమని శిష్యులందరికీ చెప్పి అందరినీ ఏం కనిపిస్తుంది? ఏం కనిపిస్తుంది? అని ద్రోణాచార్యుడు అడిగినప్పుడు, అందరూ రకరకాల సమాధానాలు చెప్పారు. అర్జునుడు మాత్రం పక్షి గుడ్డు మాత్రమే కనిపిస్తుంది అని చెప్తాడు.

అప్పుడు ఓ.. వీడికి విలు విద్యలో ప్రావీణ్యత వస్తుంది. వీడికి నిశ్చల దృష్టి, నిశ్చల బుద్ధి ఉంది అని ఆయన నిర్ణయించుకుని ఆ విలు విద్యని ఎక్కువగా అర్జునుడికే నేర్పుతాడు. ఆ రోజుల్లో గురువులు ముందు శిష్యులకి దేని మీద ఆసక్తి ఉందో తెలుసుకుని దానిలో ప్రావీణ్యుడిగా తయారు చేసేవారు. ఏకాగ్రత ఎక్కువ ఉన్నవాళ్లే, యుద్ధ విద్యలో, విలువిద్యలో రాణించగలరు అందుకే ఆ పరీక్ష పెట్టేవారు.

ఇప్పుడు విలువిద్యలు అవసరం లేదు కానీ, గురువు చెప్పిన జ్ఞానాన్ని ఎక్కించుకోగలిగే శక్తి కావాలి. అంటే బుద్ధి నిశ్చలంగా ఉండాలి. బాహ్యమంతా చంచలమే, బాహ్య దృష్టి ఉన్నవాడికి చంచల బుద్ధి ఉంటుంది. మరి భగవంతుడి మీద దృష్టి ఉన్నవాడికి నిశ్చల బుద్ధి ఉంటుంది. వీళ్ళకే మోక్ష కాంక్ష ఎక్కువ ఉంటుంది. ఎవరైతే భగవంతుడి మీద అంటే ఆత్మ మీద దృష్టి పెడతారో వాళ్ళు ఆ ప్రయత్నంలోనే ఆనందం పొందుతారు.

ఇప్పుడు చూసుకుంటే ఈ ధ్యానము, జ్ఞానము వల్ల ఆనందం లేకపోతే దీనికి ఇంత ప్రాముఖ్యం ఇవ్వరు. అంటే ఆ బాహ్య విషయాల్లో ఉన్న ఆనందం కంటే ఇదే ఎక్కువ ఆనందాన్ని ఇస్తుంది కాబట్టి. అందుకే ఆ ప్రయత్నమే మీరంతా చేస్తున్నారు. ఎందుకంటే ఈ నిశ్చల బుద్ధి కలగాలి అంటే గురువు చెప్పిన విషయాలని చాలా ఏకాగ్రతగా లోతుల్లోకి తీసుకుంటే ఆచరణలో

పెట్టుకోవడం చాలా సులువు.

మరి ప్రపంచం వైపు తిరిగి మలిన వాసనలు పోగేసుకున్న మీరు పరమాత్మ వైపు తిరిగి అవన్నీ వదులుకుంటూ, వదులుకుంటూ శుద్ధ కర్మలు చేస్తున్నారు అంటే ఆత్మ కర్మలు చేస్తున్నారు, యజ్ఞ కర్మలు చేస్తున్నారు, సత్కర్మలు చేస్తున్నారు. మీరు గమనిస్తే ఇదివరకు స్వార్థం కోసం తెలియక పాప కర్మలు చేసినా, సాత్వికంలోకి వచ్చాక అవన్నీ వదిలేసి అందరూ ఆత్మలే, ఏ జీవికి అన్యాయం చేసినా మనకి మనమే చేసుకున్నట్టు, మనము ఆత్మే అది ఆత్మే అని సత్యం గురువు దగ్గర తెలుసుకున్నాక ఇంక స్వార్థం కోసం బ్రతకరు.

అప్పుడు అశుద్ధ వాసనలు తొలుగుతూ ఉంటాయి. సాత్వికంలోకి వచ్చేటప్పటికి, సాధనలోకి వచ్చేటప్పటికీ ఇంకా ఎక్కువగా పోగొట్టుకుంటారు. అప్పుడు ఏమవుతుంది? మలిన వాసనలు పోయి శుద్ధ సంస్కారాలు, శుద్ధ వాసనలు ఏర్పడతాయి. అంటే అందరూ బాగుండాలి అనే ఒక కోరిక ఉంటుంది. అందుకే ధ్యాన ప్రచారం, శాకాహార ర్యాలీలు విస్తృతంగా చేస్తారు.

ఏ జీవి బాధపడకూడదు, ఎవరు తప్పు చేయకూడదు, ఎవరు హింసాయుత జీవితం జీవించకూడదు అని చేసే ఈ కార్యక్రమాలు సత్కర్మలు, యజ్ఞ కర్మలు అవుతాయి. మరి ఆ విధంగా అశుద్ధ వాసనలు వదిలి శుద్ధ కర్మలు శుద్ధ వాసనలతో ముందుకి వెళ్తున్నారు. మరి వీరికి లోపల ఎంతో ఆనందం కలుగుతుంది.

మీ కోసం, మీ పిల్లల కోసం, మీ శరీర బంధాల కోసం, సంపాదించి పెట్టినా ఏదో ఒక క్షణంలో దుఃఖం వచ్చినప్పుడు అయ్యో! వీళ్ళ కోసం నేను ఇంత త్యాగం చేసేనే, నన్ను వీళ్ళు ఇలా చూస్తున్నారు, ఇలాంటి మాటలు అంటున్నారు అని ఏదో ఒక క్షణంలో బాధ పడతారు. కానీ, ఈ ధ్యాన మార్గంలోకి వచ్చాక చిన్న చీమ నుంచి బ్రహ్మం వరకు అందరూ ఆత్మ స్వరూపాలే, నీ క్రింద జీవులని శిక్షించే హక్కు నీకు లేదు అని గురువు దగ్గర నేర్చుకున్నాక ముందు అందరికీ మాంసాహారం వద్దు అని చెప్పే ప్రయత్నం చేస్తున్నప్పుడు మీకు లోపల నుండి ఆనందం వస్తుంది.

జీవుడు ప్రపంచం వైపు నుంచి ఆత్మ వైపుకు తిరిగి, ధ్యాన మార్గంలోకి వచ్చి, ఇలాంటి పనులు చేస్తున్నప్పుడు లోపల నుండి ఆనందం వస్తుంది అంటే ఒకటే గుర్తు లోపల ఆత్మ ఆనందం ఉంది అంటే? భగవంతుడు ఈ కార్యక్రమంలో ఉన్నప్పుడు ఆనందాన్ని పంచుతున్నాడు.

ప్రపంచంలో ఆనందం ఉందని, సుఖ సంతోషాలు ఉన్నాయని వెతికాం. వెతికితే క్షణకాల సుఖం, క్షణకాల సంతోషం, క్షణకాల ఆనందం దొరికింది. కానీ, ధ్యానంలోకి వచ్చాక ఇది శాశ్వత ఆనంద స్థితి కలిగింది. రోజు రోజుకి ఈ ఆనందం పెరుగుతుందే కానీ తగ్గటం లేదు అంటే ఇది భగవంతుడు మెచ్చిన పని కాబట్టే ఇంత ఆనందం ఉంది అని అర్థమవుతుంది. ఇది గ్రహించడానికి నిశ్చల బుద్ధి ఉండాలి.

బాహ్యంలో తిరిగి చంచలమైన బుద్ధిని, ఆత్మ వైపుకు తిప్పి నిశ్చలం చేసుకున్నారు. మరి ఇలా నిశ్చలం చేసుకోవడానికి కారణం ఏమిటంటే గుణం సాత్వికమైంది కాబట్టి. ఇప్పుడు సాత్వికంలో నుంచి శుద్ధ సాత్వికంలోకి వెళ్తున్నారు. సాత్విక గుణంలో భగవంతుడు వైపు తిప్పారు. శుద్ధ సాత్వికంలో అందరూ ఒక్కటే అనే మాటని గ్రహిస్తారు. అందరి బాగు కోసం నేను పని చేస్తాను అని ఎవరికి వాళ్ళు నిర్ణయించుకున్నారు కాబట్టే ఈరోజు కష్టమైనా ఇష్టంగా ధ్యాన ప్రచారం చేస్తున్నారు.

అంటే మీకు ఏదో పుణ్యం వస్తుందని కాదు, పుణ్యం రావచ్చు, రాకపోవచ్చు కానీ నేను ధ్యానం నేర్పిన వాళ్ళలో ఒక్కడు శాకాహారి అయినా వాడి జీవితంలో మాంసం మానేస్తే ఎన్నో జీవులు ప్రాణాలతో హాయిగా ఉంటాయి అని ఒకే ఒక చిన్న కోరిక వల్లే ఈ రోజు పిరమిడ్ మాస్టర్లు ఇంత ఉధృతంగా ధ్యాన ప్రచారం చేస్తున్నారు.

దీన్ని బట్టి పత్రిగారు వేసిన విత్తనాలకి ఎంత అద్భుతమైన పంట వచ్చిందో మనం గమనించుకోవచ్చు. మరి దీని వెనకాల పత్రిగారి ఆశయం ఏమిటంటే సత్యం. ఎవరు ఏమనుకున్నా పట్టించుకోకుండా ఉన్న సత్యాన్ని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. ఆయన మెప్పు కోసం, మెహర్బాణి కోసం

ఎప్పుడు ఏది చెప్పలేదు, లోకం మెచ్చుకోవాలి అనుకోలేదు, ఆయన లోకేశుడు మెచ్చుకోవాలి అనుకున్నాడు కాబట్టే మనల్ని ఆయన ఆశయాలకు అనుగుణంగా తయారు చేశాడు.

ఆయన చెప్పింది ఆత్మే దైవం. హింస వదిలితేనే జీవుడు సంతోషంగా ఉండగలడు. హింసతో కూడిన ఆహారం తింటే వాడు ఎంత ధ్యానం చేసినా రాక్షస గుణాలు ఉంటాయి. హింస తో కూడిన ఆహారం మాని శాకాహారం తింటే దైవంగా ఎదుగుతారు అని పత్రిగారు బోధించిన వెంటనే అదే సత్యం అని ఆచరిస్తున్నారంటే బుద్ధి నిశ్చలమయింది కాబట్టే ఈ విషయాన్ని గ్రహించే శక్తి మీకు వచ్చింది.

అందుకే నీ బుద్ధి నిశ్చలమైతే అద్భుతాలను సృష్టించే శక్తి నీలోనే ఉందని తెలుసుకుని, ఆ శక్తిని వెలికి తీయగలవు. కానీ, నీ బుద్ధి చంచలమైనప్పుడు వజ్రాల గని నీ ముందున్నా ఒక్క వజ్రం కూడా తీసుకోలేవు. ఎందుకంటే కాసేపు ఇది మంచిదా? అది మంచిదా? అని చంచల బుద్ధితో వెతుకుతావు కాబట్టి. ఆ బుద్ధిని నిశ్చలంగా చేసుకొని నీలోకి నువ్వు ప్రయాణం చేస్తే నువ్వు ఎంతో ఎత్తుకు ఎదగగలవు, ఎంతో సాధించగలవు.

మరి ఈ రోజున ఇంత అద్భుతమైన జ్ఞానాన్ని పొందుతున్నామంటే, ఇన్ని అద్భుతమైన విషయాలను తెలుసుకోగలుగుతున్నాము అంటే మరి ఆ గురువు ఇచ్చిన ధ్యానం, జ్ఞానం ఎంత గొప్పవో మనకు అర్థమవుతుంది. అందుకే నిశ్చల బుద్ధి ఉన్న శిష్యులు గురువు పైన పరమాత్మ పైన అచంచలమైన భక్తి, అచంచలమైన విశ్వాసము, అపారమైన గౌరవం ఉంచుకుంటారు. చంచల బుద్ధి ఉన్న వాళ్ళు పత్రి గారు చెప్పారు కాని మన వల్ల ఎక్కడ అవుతుంది? అంటారు.

కాని పత్రిగారు ఎన్నో సార్లు చెప్పేవారు ఈ భూమిమీద మీరు చేయగలిగే పనే నేను మీకు చెప్తున్నాను అనేవారు. కానీ శిష్యుడు శక్తిహీనుడు అయినప్పుడు గురువు చెప్పే పనులు గ్రహించే శక్తి వాడికి ఉండదు. శిష్యుడు శక్తివంతుడైనప్పుడు గురువు ఎంత పెద్ద పని చెప్పినా చేయడానికి కనీసం

ప్రయత్నమైనా చేస్తాడు. ఇది గురువు చెప్పిన పరమాత్మ సందేశమే అనుకుంటాడు.

ఈ మంచి లక్షణాలన్నీ ఎప్పుడు వస్తాయి అంటే? రజోగుణం వదిలి, సాత్విక గుణంలోకి వచ్చి సరైన ఆహారం తింటూ, సరైన వ్యవహార చేస్తూ ఉన్నప్పుడు, చంచల బుద్ధిని వదిలి నిశ్చల బుద్ధి వచ్చినప్పుడు, అన్నీ గ్రహించే శక్తి వస్తుంది. అయితే ఇలాంటి వాళ్ళు బాహ్యంలో ఎలా ఉంటారు? అంటే ఎక్కువ మౌనంగా ఉంటారు, ఎక్కువ ఏకాంతవాసానికి ఇష్టపడతారు.

మౌనం అంటే అవసరమైనప్పుడు కూడా మాట్లాడుకుండా సైగల ద్వారా చెప్పి నోరు మూసుకోవడం కాదు. శిష్యులకి వాళ్ళు మాట్లాడే ప్రతి మాట ఒక సందేశమవ్వాలి. పత్రి గారు చెప్తారు అవసరం లేని మాట ఒక్క మాట కూడా నీ నోటి వెంట రాకూడదు అని. అవసరం ఉన్న మాటలు మాట్లాడుతూ, అవసరం లేని మాటలు వదిలేస్తే అదే మౌనం. మౌనము అంటే నీ నోట్లో నుంచి మునిలాంటి మాటలు రావాలి.

మునులు ఎలా మాట్లాడతారు? అవసరమైతే మాట్లాడతారు లేకపోతే మౌనంగా ఉండిపోతారు. అందరూ అలా ఉండగలగాలట. అంటే నీ మాట నీకైనా ఉపయోగపడాలి లేకపోతే నీ ప్రక్కవాడికైనా ఉపయోగపడాలి. అలా ప్రతి మాట అవతల వాడికి ఒక సందేశం అవ్వాలి. అలాగే ఈ నిశ్చలబుద్ధి కలవారు ఏకాంతవాసులుగా ఉండటానికి ఇష్టపడతారు. జనారణ్యంలో ఉండడానికి వాళ్ళకి ఇష్టం ఉండదు. ఎందుకంటే? మళ్లీ జనారణ్యంలోకి వెళ్తే పరమాత్మ మీద దృష్టి పెట్టిన వాళ్ళు మళ్లీ బాహ్యంలోకి వెళ్తే అవన్నీ నాకు అంటుకుంటాయని ఇష్టపడరు.

ఇప్పుడు ఇంటికి వచ్చి కాళ్ళు కడుక్కున్నాక మళ్లీ బురద గుంటలో కాలు పెట్టాలని ఎవరూ కోరుకోరు. అలాగే యోగులు ప్రపంచం అనే బురదలోకి వెళ్తే అది అంటుకుంటే మళ్లీ నేనే కడుక్కోవాలి అని వాళ్ళు ఏకాంతవాసానికి ఇష్టపడతారు. బలవంతంగా వదలడం కాదు. అవతలవాడు మాట్లాడుతున్నా వాడి మాటలు నువ్వు స్వీకరించకుండా ఉంటే నువ్వు 10 మందిలో ఉన్నా,

100 మందిలో ఉన్నా ఏకాంతవాసివే అవుతావు.

ఎక్కడ ఉన్నా నువ్వు చూసే ప్రతి దాంట్లోనూ కూడా ఓహో ఈ ఆత్మ ఇలాంటి శరీరం కావాలని కోరుకుని తెచ్చుకుంది దీంతో ఏ పాఠం నేర్చుకుంటుందో! అనుకోగలగాలి. ఒక గొప్ప ఉద్యోగస్తుడు వచ్చాడంటే వాడి ఆత్మ అలా ఉండాలి అని ఆ నిర్ణయం తీసుకుంది. బాగా చదివేవాళ్ళని చూస్తే ఈ ఆత్మ ఈ జన్మంతా మంచి చదువులు చదవడానికి నిర్ణయం తీసుకుంది అని అనుకోవాలి.

అంతేగాని ఆవిడ డ్రెస్ బాగుంది, ఆవిడ నెక్లెస్ బాగుంది, ఈవిడ హెయిర్ స్టైల్ బాగుంది ఇది కాదు గమనించాల్సింది. ఎవరిని చూసినా ఈ ఆత్మ ఈ అనుభవం కోసం వచ్చింది. ఒక సైంటిస్ట్ని తీసుకుంటే ఈవాళ సెల్ ఫోన్ లేకపోతే మానవ జీవితంలో మనుగడ లేకుండా పోతుంది. దాంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మరి ఇంత గొప్ప పరికరాన్ని కనిపెట్టి ప్రపంచానికి అందించి, ఇన్ని కోట్ల జనాభాన్ని దాని చుట్టూరు తిప్పుతున్నాడు అంటే ఆ ఆత్మకి ఎంత గొప్ప మేధస్సు ఉంది.

అందుకే యోగులు చెప్తారు ఎవరిని చూసినా ఆత్మగా చూడు. వాడి శరీరం కనబడుతుంది దాన్ని కాదు చూడాల్సింది.. వాడు గొప్ప ఆత్మ, గొప్ప పనులు చేస్తున్నాడు. లోకానికి ఉపయోగపడే పనులు చేస్తున్నాడు. కళ్ళు మూసుకుని ధ్యానం చేసి ఫోటోలు పెట్టుకోవడం కాదు. కళ్ళు మూసుకుని ధ్యానం చేసినా, కళ్ళు విప్పి లోక కళ్యాణంకరమైన పనులు చేయగలిగితే వాడు గొప్ప ఆత్మ.

పత్రిగారు కళ్ళు మూసుకొని మూల కూర్చోలేదు. ఆయన అందరికీ జ్ఞానం కావాలి ఇది ఇప్పుడు ఈ పరిస్థితుల్లో అవసరం అని ఆయన బయటకి వచ్చాడు. మరి రాఘవరావు గారు ధ్యానం మూడేసి గంటలు, నాలుగేసి గంటలు కూర్చునేవారు. పత్రిగారు నువ్వు ముయ్యడానికి రాలేదు, చెప్పడానికి వచ్చావన్నారు. నీకు అవన్నీ ఇదివరకే అయిపోయాయి అన్నారు. అప్పటి

నుంచి రాఘవరావు గారు ఈ రోజు ఏం చెప్పాలి? కొత్త పని ఏం చేయాలి? అన్నదే ఆలోచిస్తారు.

అంటే నిశ్చలబుద్ధి ఉన్నవాడికి 100 మందిలో కూర్చున్నా వాళ్ళు చేయవలసిన పని మీదే దృష్టి ఉంటుంది కాని ఫలితం మీద దృష్టి ఉండదు. వాళ్ళు సత్కర్మలు, యజ్ఞ కర్మలు చేసుకుంటూ పోతారు. ఫలితం పరమాత్మకు వదిలేస్తారు. శిష్యుడు దారి తప్పుతున్నప్పుడు గురువు చెప్తాడు. కానీ గురువు చెప్పింది ఆచరించాలా? లేదా? అన్నది వాడి మనస్తత్వం మీద, వాడి గుణం మీదా ఆధారపడి ఉంది. అందుకే మనం ఏ స్థితిలో ఉన్నామో ఎప్పటికప్పుడు గమనించుకోవాలి.

గమనించుకోకుండా నేను చెప్పిందంతా సరైనది అంటే మళ్ళీ రజోగుణంలో దిగినట్టే. అందుచేత గమనించుకోవాలి నేను ఎలా ఉంటున్నాను? ఏమి చెప్తున్నాను? చెప్పిన మాటలు ఆచరిస్తున్నానా? లేదా? అని ఎప్పటికప్పుడు గమనించుకుంటూ, తప్పు చేస్తే సరిచేసుకుంటూ, ప్రక్కవాడికి సహాయం చేస్తూ, లోక కళ్యాణకరమైన పనులు చేస్తూ, ముందుకు ఎదిగితే నిశ్చల బుద్ధితో ఉన్నట్టే.

కానీ కాసేపు ఇది, కాసేపు అది అని పరుగులు పెట్టామంటే ఇంకా చంచల బుద్ధి వున్నట్టే. నీకు పరమాత్మ ఒక గురువుని ఇచ్చాడు, ఆ గురువు ఒక సాధన చెప్పాడు, ఆ సాధనలో నువ్వు ముందుకు వెళ్ళిపోవాలి. ఆ గురువు ఇచ్చిన సాధన మాని ప్రక్కకు వెళ్ళావు అంటే దాని వల్ల చాలా నష్టం ఉంటుంది. భగవంతుడి ఆజ్ఞను ధిక్కరించిన వారు అవుతారు. నీకు భగవంతుడు గురువుని ఇచ్చినప్పుడు ఆ గురువు ఏం చెప్పాడో ఆ సాధన చేసుకుంటూ, ఆయన చెప్పిన పనులు చేసినప్పుడు యజ్ఞ కర్మలు చేసినంత ఫలితం నువ్వు పొందుతూనే ఉంటావు.

నిశ్చల బుద్ధి ఉన్న వాళ్ళు మాత్రమే మోక్షాన్ని పొందుతారు, ప్రక్క వాళ్ళని మోక్షం వైపుకు తీసుకువెళ్తారు. వాళ్ళు సాధన చేసుకుంటూ జ్ఞానం పెంచుకుంటూ ప్రక్కవాళ్ళకి పంచుతారు. జ్ఞానం పంచుతున్నాము అని

అహంకారం కాదండి చేయడానికి భగవంతుడు మనకి అవకాశం ఇచ్చాడు అని గర్వపడాలి. ఈ కొద్దిపాటి పుణ్యానికే ఇంత అవకాశం ఇస్తే, ఇంకా నేను పెద్ద కార్యాలు చేస్తే ఇకెన్ని పొందగలను అనే ఆశ, ఆశయం రెండు ఉండాలి. అప్పుడు చిన్న కార్యక్రమం చేసినా ఆనందం పొందుతారు.

మరి పత్రిగారిలాగా చేస్తే ఇంకెంత పొందుతారు. ఎప్పుడు కూడా లక్ష్యం వైపు దృష్టి పెట్టినప్పుడు, చేసిన పని మీద దృష్టి తక్కువ ఉన్నప్పుడు, నువ్వు చేసిన పని నీకు గొప్పగా అనిపించదు. లక్ష్యాన్ని మర్చిపోయి నేను ఇంత చేశాను అనుకుంటే అప్పుడు అహంకారం వస్తుంది. అది రాకుండా చూసుకోవాలి, ఎంత ఎదుగుతున్నా ఒదిగే ఉండాలి. భగవంతుడు ఇచ్చిన అవకాశం అనుకుంటే వినయం వస్తుంది, నేనే చేస్తున్నాను అనుకుంటే అహంకారం వస్తుంది. కానీ నిశ్చల బుద్ధి ఉన్నవాడు ఎప్పుడూ కూడా పరమాత్మకి గురువుకి వినమృడిగా ఉండి ఎదగడానికే ప్రయత్నిస్తాడు.


**తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే**

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

# "మానవులలోని రకాలు"

మానవులలో 5 రకాల వారు ఉన్నారు. 1) ఖనిజ జాతి మానవులు, 2) వృక్ష జాతి మానవులు, 3) జంతు జాతి మానవులు, 4) మానవజాతి మానవులు, 5) దివ్యజాతి మానవులు.

**1. ఖనిజ జాతి మానవులు:-**

వీరి చైతన్యం అత్యల్పం. చాలా కొద్దిపాటి ఆత్మ శక్తి ఉంటుంది. వీరు బొంగరం లాంటివారు. బొంగరం తన చుట్టూ తాను తిరుగుతుంది కానీ దూరం వెళ్లదు. అంటే వీరు అత్యల్ప ఆత్మ శక్తి గల మానవులు.

వీరు తమ శరీర పోషణకే చూస్తారు. వీరి స్వార్థమే వీరు చూసుకుంటారు. ఇంద్రియ సుఖాలు,భోగాలకి ప్రాముఖ్యం ఇస్తారు. ఆఖరికి భార్యా,పిల్లలు తిండి లేక మలమల మాడినా వీరు పట్టించుకోరు. వీరు చుట్టు ప్రక్కల వారు చావని, బ్రతకని పట్టించుకోరు. వీరి పని తినడం, త్రాగడం. వీరికి కుటుంబము, జాతి, సంఘము ఏమైనా పట్టదు.

రాళ్లలో కూడా విలువైనవి రత్నాలు వజ్రాలు ఉన్నాయి. అలాగే ఖనిజజాతి మానవులలో రాజులు ఉండవచ్చు కానీ వీరి ప్రవర్తన అలానే ఉంటుంది. ఉదా:-నీరో చక్రవర్తి రోమ్ నగరాన్ని తగలపెట్టి ఆనందంతో ఫిడేలు వాయించాడట. వీరు అదమాతి అధములు.

**2.వృక్షజాతి మానవులు:-**

వీరు గానుగ ఎద్దు లాంటివారు. గానుగ ఎద్దు బొంగరం కన్నా ఎక్కువ దూరం తిరుగుతుంది. దీనివలయం పెద్దది. వీరు వారి కుటుంబం, కులము వరకు చూసుకుంటారు. వారి మీదే వారి ప్రేమ, ఆదరణ ఉంటుంది.మిగతా వారి బాగోగులు పట్టించుకోరు. వీరు అధములు. ఈ రెండు రకాల వారు తమోగుణ ప్రధానులు.

**3. జంతు జాతి మానవులు:-**

వీరిది మనోస్థితి.వీరు తమ మతానికి ప్రాంతానికి ప్రాముఖ్యం ఇస్తారు. వారి గురించి పాటు పడతారు, బాధపడతారు వీరు తమ ప్రాంతం వారిని ఇష్టపడతారు ఇతరులను ద్వేషిస్తారు, ఇష్టపడరు. కానీ మానవుడు అక్కడితో ఆగిపోకూడదు ఇంకా పరిధిని పెంచుకోవాలి ప్రకృతి నియమంలో ఉండాలి ఆత్మ పురోగతి చెందాలంటే ఇంకా పెరగాలి వీరు మధ్యములు. వీరు రజోగుణ ప్రధానులు

**4.మానవజాతి మానవులు:-**

బుద్ధి స్థితి. వీరి పరిధి ఇంకొంచెం పెద్దది. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడు. అలాగే వీరి పరిధి దేశానికి ప్రాముఖ్యం ఇస్తారు. వీరు తమ దేశస్తులను మాత్రమే ప్రేమిస్తారు ఇతర మతం దేశాలకి ప్రాధాన్యత ఇవ్వరు వీరి పరిధి అక్కడితో ఆగిపోకూడదు వీరు ఆత్మస్థితికి పెంచుకోవాలి. వీరు ఉత్తములు. వీరు సాత్వికగుణ ప్రధానులు. వీరికి ఆధ్యాత్మిక గురించి తెలియదు.

**5.దివ్య జాతి మానవులు:-**

వీరిది ఆత్మస్థితి. వీరు చాలా గొప్ప మహాత్ములు. వీరి పరిధి అనంతం.. వీరి గతి సూర్య గమనం లాంటిది. అన్నిటియందు విస్తరిస్తుంది. మానవులనే కాదు జంతు జాతులన్నిటి మీద, అందరి యెడల ప్రేమ, కరుణ చూపిస్తారు. వీరిది నిర్గుణ స్థితి. వీరు అందరినీ ఆత్మ స్వరూపులుగా భావిస్తారు ధ్యానం చేస్తారు వీరికి దేని మీద అభిమానం ఉండదు. కీర్తి ప్రతిష్టలు ఆశించరు. మాన అవమానాలను సమదృష్టితో చూస్తారు.

అందుచేత ప్రతివారు ఖనిజ స్థితి నుంచి దివ్య స్థితికి రావాలి, దైవాలుగా ఎదగాలి ఇదే మానవ జన్మ లక్ష్యం.

# పరోక్ష జ్ఞానం ప్రత్యక్ష జ్ఞానంగా మారాలి అంటే?

జ్ఞానంలో రెండు రకాలు (1) పరోక్ష జ్ఞానం, (2) ప్రత్యక్ష జ్ఞానం. అలాగే జ్ఞానంలో ఎదగలేక పోవడానికి కారణాలు కూడా తెలుసుకుందాం.

**1) పరోక్ష జ్ఞానం:-**

మహాత్ములు కానీ, ఋషులు కానీ, యోగులు కానీ, సజ్జనులు కానీ, సత్పురుషులు కానీ మనకి ఎన్నో విషయాలు చెప్పడం జరిగింది. వారు ఇప్పుడు భూమిమీద లేకపోయినా పుస్తకాల ద్వారా వాళ్ళ సందేశాలు మనం చదువుకుంటున్నాం, అంటే ఏమిటి? అలాగే గురువులు చెప్పింది వింటున్నాం.

ఆత్మ, ఆత్మజ్ఞానము అంటే ఏమిటి? సత్యం అంటే ఏమిటి? అసత్యం అంటే ఏమిటి? జ్ఞానం అంటే ఏమిటి? అజ్ఞానం అంటే ఏమిటి? ఇవన్నీ వివరంగా తెలుసు కుంటున్నాం. ఇలా ఇతరుల వల్ల తెలుసుకున్న జ్ఞానాన్ని పరోక్ష జ్ఞానము అంటారు.

అంటే ఈ పరోక్ష జ్ఞానం వల్ల ఆత్మ అంటే ఏమిటో తెలుస్తుంది, ఆత్మ జ్ఞానం అంటే ఏమిటి అనే విషయం తెలుస్తుంది, కానీ అనుభవంలోకి రాదు. అది విన్నాం. అలా నాకు తెలిసింది అంటే అసంపూర్ణ జ్ఞానమే అవుతుంది.

**2) ప్రత్యక్ష జ్ఞానం:-**

స్వాధ్యాయం ద్వారా, గురువుల ద్వారా విన్నది అనుభవంలోకి తెచ్చుకోగలిగితే అది అసలైన జ్ఞానము అదే ప్రత్యక్ష జ్ఞానము. మహాత్ములందరూ కూడా ఎన్నో కష్టాలు పడి ఈ పరోక్ష జ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకోగలిగారు. మరి వాళ్ళ జీవితాలు అంత సులువుగా జరగలేదు. ఎందుకంటే వాళ్ళ జీవితాల్లో ఇలా జ్ఞానం పొందడానికి ప్రయత్నించినప్పుడు ఎన్నో కష్టాలు పడ్డారు. ఎన్ని కష్టాలు పడినా సత్యం అనుభవంలోకి రావాలి అని వాళ్ళు ఎంతో తీవ్రమైన సాధన చేశారు. ఫలితాన్ని కూడా పొందారు.

కాబట్టే యుగాలు గడిచినా వాళ్ళు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి

పోయారు. అంటే దీన్ని బట్టి పరోక్ష జ్ఞానం పొందడం తేలికే కానీ ప్రత్యక్ష జ్ఞానం పొందడము కొంచెం కష్టం. అయినా ప్రత్యక్ష జ్ఞానం కోసమే ప్రయత్నించాలి. నువ్వు ఆత్మవి అని గురువు చెప్పినప్పుడు మనం వినేసి అనుభవం కోసం ప్రయత్నించకపోతే మళ్లీ ఆ అనుభవం కోసమే పుట్టాల్సి వస్తుంది.

గురువులు సమాచారాన్ని మీకు ఇస్తారు కానీ పూర్ణమైన జ్ఞానం పొందవలసిన పని మీ చేతుల్లో ఉంటుంది. జ్ఞానానికి పరాకాష్ట తెలుసు కోవాలంటే ప్రత్యక్ష జ్ఞానమే.

**“వినడం ద్వారా తెలుసుకోవడం పరోక్ష జ్ఞానం అయితే, విన్నది అనుభవంలోకి తెచ్చుకోవడమే ప్రత్యక్ష జ్ఞానం”.** పరోక్ష జ్ఞానం సమాచారాన్ని ఇస్తుంది. ప్రత్యక్ష జ్ఞానం అనుభవం ఇచ్చి, దర్శింపచేస్తుంది.

అందుకే జ్ఞానం వింటే సరిపోదు అనుభవంలోకి రావాలి అని ఎవ్వరైనా చెప్తారు. అందుకే పత్రి గారు కూడా “అనుభవమే జ్ఞానం” అన్నారు. నువ్వు అనుభవంలోకి తెచ్చుకోకపోతే ఎంత జ్ఞానం విన్నా అది వృధా అవుతుంది. నువ్వు అనుభవంలో పెట్టుకున్న ప్రత్యక్ష జ్ఞానం నీ జీవితాన్ని ఇంకా ముందుకు తీసుకు వెళ్తుంది.

అందుకే జ్ఞానం, విజ్ఞానం, ప్రజ్ఞానం, బ్రహ్మజ్ఞానం. నాలుగు స్థాయిలు చెప్పారు. జ్ఞానం పొందాలి అని నీకు అనిపించినప్పుడు గురువు ద్వారా కొద్దిగా నేర్చుకుంటావు. “అహం బ్రహ్మాస్మి, తత్వమసి, సర్వం ఖల్విదం బ్రహ్మ” అనే పదాలు, ఆ పదాలకు వివరణ నేర్చుకుంటే అది పరోక్ష జ్ఞానమే. ఇది కరెక్టు అని ఆచరణలో పెట్టుకుంటే విజ్ఞానవంతుడు అవుతావు. ఇది ఆచరణలో పెట్టుకున్నప్పుడు నీ అనుభవం ప్రజ్ఞానం అవుతుంది. ఈ ప్రజ్ఞానంతో అక్కడితో ఆగిపోకుండా ఆ సత్య దర్శనం కలగడానికి నిరంతరము ప్రయత్నిస్తూ అందరికీ అది పంచినప్పుడు నువ్వు బ్రహ్మజ్ఞానివి అవుతావు అని చెప్తూ ఉంటారు.

అయితే ఈ పూర్ణ బ్రహ్మజ్ఞానికి ఉన్న లక్షణం ఏమిటంటే? ఎవ్వరిలోని చెడు చూడడు. బ్రహ్మజ్ఞానికి లోకంలో చెడు అన్నదే ఉండదు. ప్రతిదాన్నీ

కూడా మంచిగానే చూస్తూ ఉంటాడు. ఈ సృష్టిలో ప్రతి వాళ్ళు మంచివాళ్లే. ఎందుకు అంటే అందరూ ఆత్మ స్వరూపులే కాబట్టి. ఆ ఆత్మ ఎప్పుడూ చెడ్డదవ్వదు.

వాడికి ఉన్న మనసుకే మాలిన్యం ఉంది. ఆ మాలిన్యం తొలగించు కుంటే వాడు కూడా మంచివాడిగా మారతాడు. అందుకే బుద్ధుడు ఎవ్వరిలోని చెడ్డని చూడొద్దు, అందరూ మంచివాళ్లే, అందరూ ఆత్మ స్వరూపులే అనే భావనలో ఉండు అని మనకి చెప్తూ ఉంటాడు.

## జ్ఞానంలో ఎదగలేక పోవడానికి కారణాలు!

జ్ఞానం పెరగాలి అంటే కొన్ని చెడు లక్షణాలు వదులుకోవాలి. ప్రత్యక్ష జ్ఞానం పొందడానికి అడ్డు 1) కోపం, 2) దురాశ, 3) బంధం, 4) అహంకారం, స్వార్థం అని మహాత్ములు చెప్తారు. ఇవి ఉండకూడదట.

## కోపం

నీకు ఎదుట వ్యక్తి మీద కోపం వస్తుందంటే వాడి ఆత్మ మీద కోపమా? వాడి దేహం మీద కోపమా? అంటే అవతల వ్యక్తి యొక్క గుణాలు నచ్చనప్పుడు కోపం వస్తుంది. నీకు ఎంత కోపం వచ్చినా వాడిలో గుణం మారదు, ఆ గుణం మార్చుకోవాల్సింది వాడే. మీరు కోపగించుకున్నా అది వృధా, దానివల్ల మీరే నష్టపోతారు.

అందుకే తన కోపమే తన శత్రువు అని చెప్పడం జరిగింది. అంటే నువ్వు ఒక బ్రహ్మజ్ఞానివి అయితే అవతలవాడు కూడా ఆత్మ స్వరూపమే అన్నప్పుడు మనకి వాడి మీద కోపం కాకుండా జాలి వస్తుంది. ఎందుకంటే వాడు ఆత్మై ఉండి, వాడు భగవంతుడై ఉండి, దైవంగా ఉండవలసిన వాడు అజ్ఞానంతో జీవుడిగానే ఉంటున్నాడు అని జాలి వస్తుంది.

## దురాశ

దురాశ ఎందుకు ఉండకూడదు అంటే? నేను పైనుంచి వచ్చినప్పుడు ఏమీ తీసుకు రాలేదు,  వెళ్లేటప్పుడు ఏమీ తీసుకెళ్ళను, మధ్యలో వచ్చే ఇవన్నీ

కూడా ఇక్కడే వదిలి వెళ్ళాలి అని తెలుసుకున్న ఒక బ్రహ్మజ్ఞాని దేనికి ఆశపడడు. పేరు ప్రఖ్యాతుల కోసం కానీ, కీర్తి ప్రతిష్టల గురించి కానీ, సంపదల గురించి కానీ దేనికీ ఆశపడడు. ఎందుకంటే? అవన్నీ వచ్చే కొద్దీ నాకు అహంకారం పెరుగుతుంది కాబట్టి నాకు అవి వస్తే వస్తాయి, లేకపోతే లేదు అని ఒక నిశ్చింత తో జీవిస్తాడు ఒక బ్రహ్మజ్ఞాని. దురాశ ఉంది అంటే ఇంకా మానవులుగానే జీవిస్తాం కానీ, దైవంగా ఎదగడానికి, ఒక జ్ఞానిగా ఎదగడానికి ప్రయత్నించరు. అందుకే దురాశ ఉండకూడదు.

## బంధం

"బంధాలే భగవంతుడికి దూరం చేస్తాయి". నువ్వు ఎంతగా బంధంలో ఇరుక్కుంటావో అంతగా భగవంతుడికి దూరమైపోతూ ఉంటావు. అందుకే బంధాలని వదులుకునే ధైర్యం ఉంటేనే నువ్వు భగవంతుడికి దగ్గర అవ్వగలవు, ఏ చిన్న బంధమైనా నిన్ను భగవంతుడి నుంచి దూరం చేస్తుంది.

అంటే సంసారాన్ని, పిల్లల్ని వదిలేయమంటారా? అంటే వదలనవసరం లేదు. కానీ మితిమీరిన ప్రేమ చూపిస్తూ, వాళ్ళు లేకపోతే నేను జీవించలేను అన్నంత ప్రేమతో ఇరుక్కుపోతున్నావు. దాన్నే బంధం అంటారు. నువ్వు ఏ పరిస్థితిలో ఉన్నా, ఎక్కడ ఉన్నా జ్ఞానం పెరిగే కొద్దీ నీకు అవగాహన కావల్సింది ఏమిటంటే!

ఈ జన్మతో వచ్చిన బంధాలు ఈ జన్మ వరకే.. అవి మరు జన్మకి రావు. మనకి ఈ జన్మలో అమ్మ, నాన్న, భర్త, భార్య, అత్త, మామ, పిల్లలు అనే బంధాలు వచ్చాయి. కానీ వెళ్ళిపోగానే, మీ నుంచి ఒక్కొక్కళ్ళు తప్పుకోగానే ఇక అవి మరుజన్మకు మొయ్యలేరు, మొయ్యరు.

కానీ గత జన్మలో జ్ఞానం ఇప్పుడు ఉపయోగపడుతుంది. ఈ జన్మలో జ్ఞానం పై జన్మలోనూ ఉపయోగపడుతుంది. గత జన్మలోనూ ఆత్మ ఉంది, ఈ జన్మలోనూ ఉంది, మరు జన్మలోనూ ఉంటుంది. ప్రతి జ్ఞాని నేను బంధాలకి బానిసనైతే భగవంతుడి కృపకు పాత్రుడను కాలేను అని అర్థం చేసుకోవాలి.

అది అర్థమైనప్పుడు కుటుంబంతో ఉంటారు, సంసారంలో ఉంటారు, సంఘంలో ఉంటారు కానీ వాళ్ళతో బంధింపబడరు.

ఒక ఆత్మజ్ఞానికి, ప్రత్యక్ష జ్ఞానం పొందాలి అని అనుకున్న వాడికి బంధమే పెద్ద అడ్డు. ఇది పోవాలి అంటే ఎలాగండి అంటే తీవ్రాతి తీవ్రమైన సాధన ద్వారా దృష్టి భగవంతుడి మీద పెట్టండి. పెట్టినప్పుడు ఆ బంధం కూడా మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతుంది. మీరు చేసే పనిలో సహకారిగా ఉంటారు కానీ చెడగొట్టే వాళ్ళగా ఎవ్వరు ఉండరు.

అందుకే బంధాలకి బానిస అయినవాడు అజ్ఞానిగా మిగిలిపోతాడు. బంధాలకి బానిస కాకుండా నాకు అనుభవ జ్ఞానం కావాలి, ప్రత్యక్ష జ్ఞానం కావాలి అనుకున్నవాడు ముందుకి ఎదుగుతాడు.

## అహంకారం

మానవులుగా పుట్టిన వెంటనే తమోగుణం, రజోగుణంలో ఉన్న వారి కొంచెం పేరు ప్రఖ్యాతులు కావాలని, ధనం కావాలని ఉంటుంది.

అవి వచ్చాక మళ్ళీ వాటితో పాటు అహంకారం కూడా వస్తూ ఉంటుంది. **"అహంకారికి ఆత్మజ్ఞానం అబ్బదు అని ఉపనిషత్తులు కూడా చెప్పాయి".** ఎందుకు అంటే? అహంకారం అన్నది మనసు యొక్క గుణం. ఈ మనసు అహంకార పూరితంగా ఉన్నప్పుడు ఆత్మ నుంచి సంకేతాలు వాళ్ళకి అందవు.

ఎప్పుడైతే అహంకారం పోతుందో ఆత్మ నుంచి వచ్చే సంకేతాలు కానీ, ఆ జ్ఞానం కానీ, వాళ్ళకి అందుతూ ఉంటుంది. అందుకే అహంకారం ఉండకూడదు.

అలాగే సాధన చేస్తున్నప్పుడు కొన్ని కొన్ని అనుభవాలు వస్తాయి. జరగబోయేవి తెలియడం, కొన్ని స్ఫురణకి రావడం ఇట్లాంటివి. అలా తెలుస్తున్నప్పుడు నేను గొప్ప జ్ఞానినని అందరూ అనుకోవాలని, నాకు జరగబోయినవన్నీ తెలిసిపోతున్నాయి అని ప్రతి వాడికీ చెప్తారు.

దాంతో వాళ్ళు అమ్మో.. ఈయన గొప్ప యోగి అండి, యోగిలా జీవిస్తాడండి అని పొగడటం మొదలు పెడతారు. ఇంక అక్కడి నుంచి తెలియకుండానే మీలో అహంకారం పెరుగుతూ వుంటుంది.

ఒక్కొక్కసారి కొందరు చెప్తూ ఉంటారు. ధ్యానంలోకి వచ్చిన కొత్తలో నాకు అవి కనబడేవి, ఇవి కనబడేవి, ఈ మధ్య కొంచెం ధ్యానం శ్రద్ధ తగ్గింది ఏమి కనిపించట్లేదు అంటారు. ఎలా కనిపిస్తాయి? ఏమీ కనిపించట్లేదు, ఏమీ అనిపించట్లేదు, ఏమి వినిపించట్లేదు అంటే నీలో ఖచ్చితంగా అహంకారం పెరిగింది. పెరగడం వల్లే అవి తగ్గిపోతున్నాయి. ఎప్పుడైతే అహంకారానికి మనసులో చోటిచ్చారో ఆత్మ నుంచి నీకు అందవలసినవన్నీ కూడా ఆగిపోతాయి, ఇది గుర్తుంచుకోండి.

ప్రతివాడు, ప్రతి నిమిషం నాకు అహంకారం ఉందా? లేదా? అని గమనించుకోవాలి. పేరు ప్రతిష్టలు కూడా దిగజార్చడానికే వస్తాయి. ఏది పెరుగుతున్నా నేను నేనుగా ఉండాలి, నాకు ఆత్మ దర్శనం కావాలి, ప్రత్యక్ష అనుభవం కావాలి అని ఎన్ని సిద్ధులు వచ్చినా.. ఎక్కడా అహంకారం పెంచుకోకుండా ఉండాలి.

ఆ సిద్ధులు నువ్వు ప్రదర్శించినప్పుడు నీ ఎదుగుదల ఆగిపోయి మొట్టమొదటకి వస్తావు. కానీ ఇదే సిద్ధులు లోక కళ్యాణం కోసం ఉపయోగించ గలిగితే ఆంజనేయ స్వామి లాగా అక్కడ ఆత్మ దర్శనం కలుగుతుంది.

సిద్ధులు వచ్చినప్పుడు అహంకారం పెంచుకుంటే దిగజారిపోతారు, అహంకారం పెంచుకోకుండా లోక కళ్యాణం కోసం ఆ సిద్ధులని ఉపయోగించిన రోజున ఆత్మజ్ఞానిగా, బ్రహ్మజ్ఞానిగా ఎదుగుతూ వుంటారు.

## స్వార్థం

ఆధ్యాత్మిక మార్గంలో గుర్తుంచుకోవాల్సిన ఇంకొక అతి ముఖ్యమైన పాయింట్ ఏమిటంటే స్వార్థం లేకుండా జీవించడం. నావాళ్ళు, నా స్నేహితులు, నా పిల్లలు, నా భార్య, నా భర్త అన్నది పెద్ద స్వార్థం.

ఉదా:– మీరు నలుగురితో కలిసి ఎక్కడికైనా వెళ్ళినప్పుడు ప్రక్కవాడు ఎవడో రండి మేడం భోంచేద్దాం అంటే ఉండు, ఉండు నా కూడా వచ్చినోళ్ళు ఇంకా అక్కడ ఉన్నారు. వాళ్ళతో కలిపి తింటాను అంటారు. అంటే అంత ఆప్యాయంగా, ప్రేమగా రండి తినండి అని పిలిచిన వాళ్ళు నీకు బంధువులు కాదా? అంటే నీ కూడా వచ్చిన వాళ్ళు ఏదో అనుకుంటారని ఇక్కడ వీళ్ళని నిరుత్సాహపరుస్తూ ఉంటావు, ఇది చిన్న తప్పు తెలియదు.

కానీ నిజంగా నువ్వు ఏ పని చేసినా నిన్ను మెచ్చుకునేవాళ్లు నిజమైన స్నేహితులు. నువ్వు వీళ్ళతో భోజనం చేసేసావని వాళ్ళకి కోపం వస్తే వాళ్ళేం స్నేహితులు! చిన్నచిన్న పొరపాట్లు మామూలుగా మనకి సహజంలా అనిపిస్తాయి. అందరూ ఆత్మ బంధువులే, అందరూ ఆత్మ స్వరూపులే అని తెలుసుకున్నా ఇంకా కొంతమంది మీద ఎక్కువ ప్రేమ చూపిస్తారు, కొంతమంది మీద తక్కువ ప్రేమ చూపిస్తారు.

మరి ఇది ఎంతవరకు కరెక్ట్ అని ఎవరికి వారు విచారణ చేసుకుని తెలుసుకోవాల్సిన విషయం. ఈ పొరపాటు తల వెంట్రుక అంత చిన్నది. అయినా కానీ, ఆ చిన్న తప్పు కూడా భగవంతుడు క్షమించడు అని నీకు ఎరుకలో ఉండాలి.

అందరూ ఆత్మ స్వరూపులు అనే పాఠాన్ని కంఠస్థ పట్టడం కాదు. ప్రవర్తన అలా ఉండాలి. నువ్వు ఎన్ని క్లాసులు చెప్పినా, ఎన్ని నోట్సులు రాసినా, ఎన్ని క్లాసులకి హాజరైనా నీ ప్రవర్తన మార్చుకోకపోతే నీకు ప్రత్యక్ష అనుభవం కలగదు.

స్వార్థరహితమైన జీవితమే భగవంతుడు చూసేది. స్వార్థ పూరితంగా, మనసులో కల్మషంతో ఉంటే పక్కనే ఉన్న పరమాత్మకు అన్నీ తెలుస్తాయి. నీ ప్రక్కన కూర్చున్న వ్యక్తి నీ మనసు తెలుసుకోలేకపోవచ్చు. కానీ, నీలోనే నీ హృదయంలోనే ఉన్న భగవంతుడికి నీ ఆలోచన తెలుసు, నీ స్వార్థమూ తెలుసు, నీ ప్రేమా తెలుసు.

అందుకనే నీ ఆలోచన, మాట, చేత ఒకటి అవ్వాలి. ఆత్మ బంధువులారా అని పిలవడం కాదు అలా అనుభవపూర్వకంగా ప్రవర్తించ గలగాలి.

## జ్ఞానంలో ఎదగాలి ప్రత్యక్ష జ్ఞానం పొందాలి అంటే ఏమి చేయాలి?

**1) వినయంగా ఉండాలి:**

ఎంత వినయంగా ఉంటే అంత ఎదుగుతాం. ఆత్మజ్ఞానం, బ్రహ్మ జ్ఞానం, ప్రత్యక్ష జ్ఞానం అనుభవంలోకి వచ్చాయి అంటే వినయమే దానికి మొదటి మెట్టు. మనం ఎంత వినయంగా ఉంటామో ప్రకృతి, పరమాత్మ, గురువు అంత అద్భుతంగా మనల్ని తీర్చి దిద్దుతారు.

గురువు జ్ఞానం ఇస్తాడు. కానీ అక్కడ వినయం ఉంటే వీడు ఎదుగుదలకు అర్హుడు అని గురువు అనుకుంటాడు. ప్రతి వాళ్ళని ఆత్మ స్వరూపులుగా చూస్తున్నప్పుడు వీడు ఎంత వినయంగా ఉన్నాడు అని ప్రకృతి అనుకుంటుంది. వినయం ఉన్నవాడికే జ్ఞానం అందిస్తే అద్భుతంగా దైవంగా ఎదిగి లోక కళ్యాణకరమైన పనులు చేస్తాడు అని పరమాత్మ అనుకుంటాడు.

గురువు, ప్రకృతి, పరమాత్మ ఎప్పుడు కూడా మనల్ని గమనిస్తూ ఉంటారు. గురువు ప్రత్యక్షంగా కనిపిస్తాడు ప్రకృతి,పరమాత్మ కనిపించరు. కానీ గురువు కంటే ఎక్కువ మనల్ని గమనించేది వాళ్ళే. అందుకే నీ ఎదుగుదలకి వినయమే మొదటి మెట్టు. ఇది మనం తెలుసుకోవాలి.

**2) సామూహిక ధ్యానము, సజ్జన సాంగత్యం చెయ్యాలి :**

చాలామంది ఎందుకు అస్తమాను భీమవరం వెళ్తారు? ఇక్కడే కూర్చుని ధ్యానం చేసుకోవచ్చు కదా? అని విమర్శిస్తూ ఉంటారు. ఎందుకు అంటే ఇలా సజ్జనులతో సాంగత్యం వల్ల ప్రత్యక్ష జ్ఞానం తొందరగా కలుగుతుందట. మనం గురువు దగ్గర విన్నా కూడా సజ్జన సాంగత్యంలో పాల్గొంటేనే, సామూహిక ధ్యానంలో పాల్గొంటేనే బాగా ఎదుగుతారు.

అందుకే అష్టావక్రుడు అన్నాడు మూడు లోకాలలోకి అతి గొప్పదైన పుణ్యకర్మ ఏది అంటే? సజ్జన సాంగత్యంలో పాల్గొనడమే. నువ్వు ప్రత్యక్ష జ్ఞానం పొందాలి అంటే మరి ఈ సజ్జన సాంగత్యంలో పాల్గొనాలి. మరి అసలైన సజ్జన సాంగత్యం ఎక్కడ దొరుకుతుంది అంటే అది భీమవరంలోనే ఉంటుంది.

ఎందుకంటే భీమవరం వచ్చిన ఎవ్వరూ కూడా ఆరోగ్యం బాగుండాలి, సంకల్పాలు నెరవేరాలి, కర్మలు దగ్ధం అవ్వాలి అనే రకరకాల మనస్తత్వాలతో రారు.

అందరూ కూడా ఆత్మజ్ఞానం పొందాలి, ఆత్మని దర్శించాలి అనే ఆలోచనతో వచ్చిన సజ్జనులు కాబట్టే ఇలాంటి సజ్జన సాంగత్యంలో పాల్గొంటే వాళ్ళకి ప్రత్యక్ష జ్ఞానం తొందరగా దొరుకుతుంది. ఎప్పుడు? ఎలా ప్రవర్తించాలి? అన్నది సజ్జన సాంగత్యం ద్వారా ప్రతి నిమిషం తెలుసుకోవాలి.

చాలామంది భీమవరం వెళ్లకపోతే ఏమిటి లైవ్ ఇస్తున్నారు కదా! నేను చూస్తున్నాను కదా అనుకుంటారు. కానీ అవకాశం లేని వాళ్ళకి లైవ్. క్లాస్ అయితే మీరు వినగలరు కాని ఆ సామూహిక ధ్యానం మీకు భీమవరంలోనే దొరుకుతుంది. అసలైన సజ్జన సాంగత్యం మీకు అక్కడే దొరుకుతుంది.

బయట జరిగే సజ్జన సాంగత్యాలు కోరికలతో ఉంటాయి. మరి భీమవరంలో జరిగే సజ్జన సాంగత్యం వల్ల ఆత్మ మీద ప్రేమ పెరుగుతుంది, ఆత్మ శక్తి పెంచుకోవాలనే కోరిక పెరుగుతుంది, ఆత్మ వైపు దృష్టి మరలుతుంది.

పరోక్ష జ్ఞానం లో ఉన్న మీరు ప్రత్యక్ష జ్ఞానం పొందాలనే మిమ్మల్ని పదే పదే భీమవరం రమ్మని కోరుతున్నాం. ఒక యోగికి, ఒక సాధకుడికి, ఒక జ్ఞానికి అన్నిటికంటే ఎక్కువ లాభం చేకూర్చేది సజ్జన సాంగత్యమే. సత్పురుషులు చెప్తారు కానీ ఆచరించవలసింది జ్ఞానే.

అంటే ఇక్కడ ఆత్మే భగవంతుడు అనే సత్యాన్ని ఇంతమంది నమ్ముతున్నారని నీకు అక్కడ చూస్తే ప్రత్యక్షంగా తెలుస్తుంది. వీళ్ళందరూ కోరికలు లేకుండా వచ్చారు, వీళ్ళెవ్వరు సంకల్పాలు పెట్టరు, అనారోగ్యం

కోసం రాలేదు. ఇంతమంది కేవలం ఆత్మను తెలుసుకోవాలి, ఆత్మజ్ఞానం పొందాలనే ఉన్నారు అంటే మానవుడికి ఇదే కరెక్ట్, ఇదే ధర్మం అని ఇక్కడికి వచ్చి తెలుసుకుంటారు.

అందుకే సాధకులకి వినయం మొదటి మెట్టు అయితే సజ్జన సాంగత్యంలో, సామూహిక ధ్యానాల్లో పాల్గొనడం రెండో మెట్టు. విన్న జ్ఞానం తొందరగా అనుభవంలోకి రావాలి అంటే, ప్రత్యక్ష జ్ఞానం పొందాలి అంటే! ఆశకు లోబడకూడదు, బంధాలను వదులుకునే ధైర్యం ఉండాలి, కోపాన్ని అవసరమైనప్పుడు ప్రదర్శించాలి, అహంకారం ఉండకూడదు, స్వార్ధరహితంగా జీవించాలి.

అలాగే ఆత్మజ్ఞాని క్షుద్రవిద్యలకి ఎప్పుడూ దూరంగా ఉండాలి. అవి నేర్పే గురువులు భూమిమీద తక్కువే కానీ దాని గురించి ఈషణ్మాత్రము ఆశ ఉన్నా మళ్ళీ క్రింద పడిపోతారు. సిద్ధులు వచ్చినా అహంకారం పెంచుకోకుండా అవసరమైనప్పుడు లోక కళ్యాణం కోసం ఉపయోగించినప్పుడు ఆత్మజ్ఞానం వస్తుంది. స్వార్థం కోసం ఉపయోగిస్తే మళ్లీ కిందకి దిగజారిపోతూ వుంటారు.

ఇవన్నీ తెలుసుకుంటూ పరోక్ష జ్ఞానం పొందడంలో ఉన్న మనము ప్రత్యక్ష జ్ఞానం పొందడానికి ప్రయత్నించవలసిన అవసరం ఎంతైనా ఉంది. జ్ఞానానికి పరాకాష్ట చిట్ట చివరి స్థితి ఏమిటి అంటే ప్రత్యక్ష జ్ఞానమే. ఆత్మ ఉంది అని తెలుసు, ఈ శరీరంలో ఉందని తెలుసు కాని అనుభవానికి ఇంకా రాలేదు. ఆ అనుభవం పొందడమే ప్రత్యక్ష జ్ఞానం.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.70/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 7) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 8) పంచకోశాలు | - | రూ.60/- |
| 9) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 10) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 11) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్:9440309812,



## Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Die before death! | Rs.120 |
| 4. | The Law of Karma | Rs.100 |
| 5. | What is Meditation? | Rs.80 |
| 6. | True Path | Rs.80 |
| 7. | What comes after death ? | Rs.70 |
| 8. | How to improve Financial Status ? | Rs.60 |
| 9. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 10. | What is Intention? | Rs.50 |
| 11. | Why is this life? | Rs.50 |
| 12. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 13. | Meditation for the Development of Students | Rs.40 |
| 14. | Non violence and vegetarianism | Rs.40 |



# श्री तटवर्ती वीर राघवराव के हिन्दी किताब

1. आत्म शास्त्र ।........................................................ Rs.200/-
2. ध्यान विद्या ।........................................................ Rs.160/-
3. भगवद् गीता का सार ।.............................................. Rs.160/-
4. सत्य मार्ग ।........................................................ Rs.160/-
5. मरने से पहले मरना है।.............................................. Rs.130/-
6. गाईडिंग ध्यान क्यों नहीं ?........................................ Rs.120/-
7. भगवान कौन है।...................................................... Rs.120/-
8. कर्म सिद्धांत ।........................................................ Rs.120/-
9. विज्ञान का अर्थ – निहितार्थ ।.................................... Rs.120/-
10. ब्रह्म ज्ञान ।........................................................ Rs.100/-
11. यह जीवन क्यों है ? .................................................. Rs.100/-
12. मेहर बाबा का संदेश ।.............................................. Rs.100/-
13. मरने के बाद, साथ में आने वाले विषयों ।................ Rs.80/-
14. भगवत के दृश्यों का अर्थ ।........................................ Rs.80/-
15. आत्म हंतक कौन होता है ।........................................ Rs.70/-
16. दुख निवारण का मार्ग................................................ Rs.75/-
17. उत्तम पुरूष............................................................ Rs.60/-
18. आर्थिक स्थिति बढाना है तो ? ................................ Rs.60/-
19. निर्वाण मार्ग.......................................................... Rs.60/-
20. सत्य.................................................................... Rs.50/-
21. क्या हम इस लोक के वासी हैं या परलोक के वासी हैं ? ......... Rs.50/-
22. गुरू को पहचानना कैसे ?.......................................... Rs.50/-
23. विद्यार्थियों के विकास के लिए ध्यान विद्या ............... Rs.50/-
24. शाकाहार ही मानव का आहार है! ............................. Rs.50/-
25. संकल्प अर्थात ?...................................................... Rs.40/-


**For Books Contact : TATAVARTHY VEERA RAGHAVARAO**
**Tatavarthyvari Street, BHIMAVARAM-534201.**
**W.G.Dist., A.P. Ph: 94403 09812**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కర్మ సిద్ధాంతం - రూ.80/-
20) ధ్యానమంటే ? - రూ.80/-
21) త్రివిధాలు - రూ.80/-
22) ఉత్తమ పురుషుడు - రూ.80/-
23) శాస్త్రాల అర్థం-అంతరార్థం - రూ.70/-
24) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
25) జ్ఞాన జ్యోతి - రూ.70/-
26) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
27) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
28) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
29) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
30) బుద్ధుని సందేశాలు - రూ.70/-
31) భూతదయే దైవత్వం - రూ.70/-
32) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
33) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
34) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
35) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
36) బ్రహ్మాజ్ఞానం - రూ.60/-
37) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
38) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
39) అతీంద్రియ శక్తులు - రూ.60/-
40) ఆలోచించండి - రూ.60/-
41) నిర్వాణ మార్గం - రూ.60/-
42) ధ్యానులకు సూచనలు - రూ.60/-
43) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
44) సంకల్పమంటే? - రూ.50/-
45) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
46) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
47) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.50/-
48) మహాత్ముల సందేశాలు - రూ.40/-
49) సత్యం - రూ.40/-
50) చక్రాలు - రూ.40/-
51) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
52) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
53) మౌన ధ్యానం - రూ.40/-
54) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా?-రూ.20/-
55) శాకాహారమే మానవాహారం - రూ.15/-
56) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



- "ఆత్మదృష్టి కలవాళ్లు అందరిలోని ఆత్మని దర్శిస్తారు, అందరూ వీళ్ళకి ఆత్మ స్వరూపులుగానే కనబడతారు."
- "భగవంతుడు బాహ్య ప్రియుడు కాదు, భావ ప్రియుడు."
- "సృష్టిలో మానవులే కాదు సకల చరాచర జీవులు కూడా ఆత్మస్వరూపులే."
- "సర్వజీవుల సేవే సర్వేశ్వరుడి సేవ."
- "ధర్మాన్ని రక్షిస్తే! ఆ ధర్మమే నిన్ను దైవమై రక్షిస్తుంది."
- "సత్యం కోసం ప్రయత్నిస్తున్న వారికి హాని కలిగించడమే ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించడం."
- "ధర్మాన్ని ఆచరించిన వారు చాలా తొందరగా సత్యానికి చేరువ అవుతారు."
- "సత్యాన్ని ఆశ్రయించిన వారి జీవితం వైభోగమే."
- "భగవంతుని దర్శించడానికి యోగ మార్గమే సరి అయినది."
- "జీవుల్ని హింసిస్తే భగవంతుని హింసించినట్టే."
- "ఆత్మ స్థితిలో ఉన్నవాడు దేనికి ఎవరికి భయపడడు, ప్రలోభాలకు లొంగడు."
- " సమాధి స్థితి అంటే అంతరంగంలో సమాధానాలు దొరుకుతున్న స్థితి."
- "విచారణే పరమ జ్ఞానం" అన్నారు వశిష్టులవారు.
- "సాత్విక శ్రద్ధ ఉన్నత స్థితికి తీసుకువెళ్లి సత్యాన్ని చేరుకునేటట్టు చేస్తుంది."
- " ఎంత వినయంగా ఉంటే అంతగా ధ్యానంలో పెరుగుతూ ఉంటారు."
- "వినయం ఊర్ధ్వలోకాలకి, అహంకారం అధోలోకాలకి తీసుకుని వెళ్తుంది."
- "సేవకు, ప్రేమకు, త్యాగానికి దూరం అవుతే అహంకారం పెరుగుతూ ఉంటుంది."
- "కోటి జన్మలు ఎత్తినా సద్గురువు దొరకకపోతే నీ శరీరం లోపల ఉన్న పరమాత్మను తెలుసుకోలేవు, మోక్షం పొందలేవు."
- "64 కళలు నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవాల్సింది మిగిలే ఉంటుంది."
- "అపరా ప్రకృతిని ఆరాధిస్తే జన్మలు వస్తాయి, పరా ప్రకృతిని ఆరాధిస్తే మోక్షం వస్తుంది."
- "బంధాలే భగవంతుడికి దూరం చేస్తాయి."
- "అహంకారికి ఆత్మజ్ఞానం అబ్బదు."

ఈ రకంగా జ్ఞానపరమైన సందేశాలతో కూర్చబడినదే ఈ "సాధనలో స్థితులు" అనే పుస్తకం. పాఠకులు వీటిని నిదానంగా చదివి, అర్థం చేసుకొని, ఆచరించి తరిస్తారని ఆశిస్తూ...

- బ్రహ్మావిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ. 70/-